# ఏదీ నాది కాదు



డా॥ రావూరి భరద్వాజ

# ఏదీ నాది కాదు

## కవితానికలు

## డాక్టర్ రావూరి భరద్వాజ

సంపాదకులు

## వై. జితిన్ కుమార్

మా అమ్మ, నాన్న; నాకో తమ్ముణ్ని ఇద్దరు చెల్లెళ్ళను ప్రసాదించారు. ఒక చెల్లెలి పేరు కోటేశ్వరమ్మ. మరో చెల్లెలి పేరు సుందరమ్మ. తమ్ముడిపేరు నారాయణమూర్తి.

అనూహ్యమయిన దరిద్రం కారణంగా, చిన్నచెల్లెలు సుందరమ్మకు, తగిన మందులిప్పించలేకపోవడం వల్ల, ఆ సోదరి, నా చిన్నతనంలోనే, నా కళ్ళముందే చనిపోయింది. ఇదేకారణం వల్ల, మరికొంత కాలానికి తమ్ముడు నారాయణమూర్తి కూడా కాలం చేశాడు.

ఈ రెండు సంఘటనలు నన్ను అతలాకుతలం చేశాయి.

నా చుట్టూ ఉన్న వారిలో, ఎవరు-రవంత దయతో సాయపడినా, నా సోదరీసోదరులు, నాకు దక్కేవారు. అలా దక్కనందుకు, నేనిప్పటికీ కుమిలిపోతూనే ఉంటాను.

మానవజీవితంలో, ''దయ''కున్న ప్రాముఖ్యత ఏ పాటిదో, అదెంతటి అమూల్యమయిందో, అనుభవపూర్వకంగా అప్పటి నుండే తెలుసుకోవడం ప్రారంభించాను.

ప్రభువు దయామయుడు!

''కరుణ''ను గురించి, హృదయానికి హత్తుకొనేలా బోధపరచడం కోసం; ముందుగా ఉక్కిరిబిక్కిరయ్యేటన్ని కష్టాల్ని కల్పించి, ఆ ఊబిలోంచి బయటపడలేని దుర్దశలో విలవిలలాడుతున్నప్పుడు, ఓ చల్లనిచూపు, ఓ మెత్తని పలకరింపు, ఓదార్పుతో కూడిన ఓ చిరునవ్వు, సాయపడడం కోసం కాసిని మునివేళ్ళు-ప్రత్యక్షమవుతాయి.

ఆ చల్లని చూపు నిండా, ఆ మెత్తని పలకరింపు నిండా, ఓదార్పుతో కూడిన ఆ చిరునవ్వు నిండా, ముందుకొచ్చిన మునివేళ్ళ నిండా ''దయ'' ఎలా చిమ్మరిస్తూ ఉంటుందో, మాటలు చెప్పలేవు; అనుభవం మాత్రమే చెబుతుంది.

అన్యథా భావించకండి!

నన్ను మన్నించండి!!

ఇలాంటి అనుభవ సంపద, నాకు పుష్కలంగా ఉంది!

ఒకసోదరిని, సోదరుని, నాకు దూరం చేసిన ప్రభువు; ఎందరో సోదరీ, సోదరులను నాకు ''వరాలు''గా ప్రసాదించాడు.

అలాంటి అనేక వరాల్లో గొప్ప వరం, మా శ్యామలక్కగారు.

జన్మించింది చాలా సామాన్యమయిన కుటుంబంలో, అయినా-అసామాన్యమయిన రీతిలో, జీవిత శకటాన్ని నడిపించారు మా శ్యామలాదేవిగారు.

మా రావస్వామి బావగారు, ఉండంత ఉద్యోగంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నప్పుడయినా; కొండంత స్థాయికి ఎదిగినప్పుడయినా; మా శ్యామలక్కగారు నిరాడంబరమయిన చిరునవ్వులాగానే ఉండేవారు.

ప్రతి పురుషుని విజయం వెనుకా, ఓ బంగారుతల్లి, దృశ్యాదృశ్యంగా ఉంటుందన్న సూక్తిని నేను అక్షరాలా నమ్ముతున్నాను.

నేను కాస్త కాలూని నిలబడడానికి కాంతమ్మగారు కారణం!

మా రామస్వామి బావగారు, ఇంత ఎత్తుకు ఎదగడానికి, మా శ్యామలక్కగారు కారణం!

అవరోధాలు, అవమానాలు, అష్టకష్టాలు ముసిరి, బతుకును బండరాళ్ళ గుట్టకింద మార్చినప్పుడు కూడా; మా శ్యామలక్క-ఓర్పును, దయను, జాలిని పదిలపరచుకొన్నది. ఉన్నంతలోనే, చేయగలిగింది చేసింది! మరొకరికి ఆదర్శంగా నిలిచింది!!

పోలిక సరయినది కాదని తెలిసి కూడా సాహసిస్తున్నాను!

మా రామస్వామి బావగారికీ, నాకూ, కొన్ని కొన్ని విషయాలలో సామ్యాలున్నాయి.

ముఖ్యమయింది-మా ఉభయుల బాల్యజీవితాలూ, బాధామయాలు కావడం.

మరీ ముఖ్యమయింది-మూర్తీభవించిన కారుణ్యమూర్తులు, మా జీవిత భాగస్వామినులు కావడం.

నేను మా ఇంటిని "కాంతాలయం"గా మార్చుకొన్నాను. మా బావగారు తమ ఇంటిని "శ్యామలా సదనం"గా మార్చుకొన్నారు.

కాంతమ్మగారి స్మృతికావ్య పంచకంలోని "ఒకింత వేకువ కోసం"అన్న పుస్తకానికి, మా బావగారిని పరిచయం రాయమన్నాను. ఆయనగారేమో ఆ పుస్తకానికి "కొంచెం సువర్ణం పూసి, ఇంకొంచెం సుగంధం రాసి"గుభాళింప చేస్తూ నాకు ఇచ్చారు.

నేను-మా శ్యామలక్కగారి చేతి అన్నం చాలాసార్లు తిన్నాను. ఆదరాభిమానాలనూ ఆరగించాను.

కొన్ని కొన్ని రుణాలు ఎప్పటికీ తీరవు. అవి-తీర్చగలిగినవీ కావు!

అయినా-

ఈ చిన్న పుస్తకాన్ని, మా శ్యామలక్కగారికి, కానుకగా ఇస్తున్నాను.

భరద్వాజగారి మరికొన్ని పుస్తకాలు

పాకుడురాళ్ళు

కాదంబరి

జీవనసమరం

కరిమింగిన వెలగపండు

నాలోని నీవు

అంతరంగిణి

ఐతరేయం

అయినా ఒక ఏకాంతం

ఒకింత వేకువకోసం

వెలుతురు చినుకులు

రవ్వలు

నా గురించి నాలుగు మాటలు

ఏదీ నాది కాదు

నేను- అంధాంధకారంలో ఉన్నప్పుడూ, అంధకారంలో ఉన్నప్పుడూ, మసకచీకట్లో ఉ

న్నప్పుడూ, వేకువ వెలుతురులో కొచ్చినప్పుడూ, నన్ను ఆదరించినవారూ, అక్కున చేర్చుకున్నవానూ చాలా తక్కువమంది, సంఖ్యాపరంగా వీరు తక్కువే కావచ్చుగానీ, ఈపిడికెడు మందీ, అడుగడుగునా నన్నాదుకొన్నారు. ఆత్మీయతను పంచిపెట్టారు. నా బలహీనతలను కప్పి పుచ్చారు. నాపొరబాట్లను సమర్థించారు.

ఇప్పుడు-ఇంకొంచెం వెలుతురు నాకు లభించింది. ఈ పిడికెడు మంది నా లొట్టలను, సొట్టలను నాకు గుర్తుచేస్తున్నారు. నాలోపాలను నాకు ఎత్తి చూపుతున్నారు.

‘‘ఎందుకిలా చేస్తున్నా?’’రన్నాను బాధపడుతూ.

‘‘ఇవి కూడా లేనంత స్వచ్ఛంగా, సౌమ్యంగా నువ్వుండాలని’’అన్నారు వారు నా గడ్డాన్ని పుణుకుతూ.

నేనో నమస్కారంగా మారి, వారి పాదాలమీద వాలిపోయాను. ఆలింగనంగా మారి వారిని చుట్టేశాను.

ooooooooooo

సాధారణ స్థాయి నుండి అసాధారణ స్థాయికెదిగిన సంపన్నులలో కొంతమంది నాకు తెలుసు. వారు నిరాడంబరంగానూ, నిగర్వంగానూ ఉండడమూ నాకు తెలుసు.

అక్షరంతో ప్రత్యక్షంగా సంబంధం లేని వంశంలో జన్మించి అక్షరాలనూ, పదాలనూ, వాక్యాలనూ...ఏర్చుకుంటూ,పేర్చుకుంటూ మహారచయితలుగా ఎదిగినవారూ, దిశలకు విస్తరించిన వారూ నాకు తెలుసు.

వీరు కూడా నిరాడంబరంగానూ, నిగర్వంగానూ ఉండడం కూడా నాకు తెలుసు.

చిటికెడు దాచుకొన్నవారూ, పిడికెడు రాసినవారూ నాకు తెలుసుగానీ; వారి పటాటోపాలను మాత్రం నేనర్థం చేసుకోలేకపోతున్నాను.

ooooooooooo

మురికి చొక్కాను, పెరట్లో ఉన్న దండెంమీద పడేశాను నిన్న రాత్రి. ఉదయానికల్లా వెండిలా తెల్లగా మెరిసిపోతున్నదది. వెన్నెలమ్మ ఏం చేసిందో నాకు తెలీదు.

ooooooooooo

‘‘నీకు సంతృప్తి కావాలా? అసంతృప్తి కావాలి?’’అన్నారు ప్రభువు ఉదయపు నడకలో.

‘‘అసంతృప్తి’’అన్నాను.

ప్రభువు ఆశ్చర్యంగా చూశాడు నావేపు.

‘‘ఉన్నచోటనే ఉండిపొమ్మంటుంది సంతృప్తి. మునుముందుకు నడిపిస్తుంది అసంతృప్తి’’అన్నాను.

ప్రభువు-నా వీపుతట్టాడు!

ఎందుకో తెలీదు.

ooooooooooo

‘‘రాళ్ళను పలకరించడానికి పోతున్నాట్ట ఆ బాబుగారు!’’ అన్నదా బుజ్జితల్లి చాలా

మామూలుగా!

పక్కనే కూచున్న తాతయ్య, కళ్ళు తుడుచుకున్నాడు.

"ఏమయింది తాతా?"అన్నదా అమ్మాయి ఆశ్చర్యపోతూ. "నేనేమన్నా తప్పుగా మాట్లాగానా?"

"లేదమ్మా! మనుషులతో మాట్లాడీ, మాట్లాడీ విసుగెత్తిపోయిన ఆ దురదృష్టవంతుణ్ని చూస్తే జాలేసింది! ఎంత క్షోభించకపోతే, మనుషుల్ని వొదిలి, రాళ్ళతో కబుర్లాడేందుకు సిద్ధమవుతాడు?"అన్నాడా తాతయ్య తన గతానుభవాలను తలచుకొంటూ.

oooooooooo

శత్రువులంటే నాకు భయం. బయటి శత్రువులంటే మరీ భయం. లోపలి శత్రువులంటే ఇంకా ఇంకా భయం. ఎందుకంటే-నా బయటి శత్రువులను జయించడానికి, మీ వంటి వారి సాయం నేనడగనూ వచ్చు, మీరు సాయపడనూ వచ్చు. నాలోపలి శత్రువులు, నా కసలు శత్రువుల్లాగా కనపడరు. అలాంటివారు నాలో ఉన్నట్టు కూడా నాకు తెలీదు. నాకు తెలియకుండా నాలోనే ఉన్న శత్రువుల్ని నా అంతట నేను తొలగించుకోవాలి. అందుకే అంతశ్శత్రువులంటే నాకంత భయం!

oooooooooo

ప్రభువు మొండివాడు.  నేనంతకన్నా మొండివాణ్ని, తనకూ, నాకూ మధ్యగల సంబంధాలను అంచనావేయడం కోసం, నన్ను నానా రకాల బాధల్లోనూ ఉడికించాడు. నేను కిక్కురుమనకుండా చిమిడి పోయానే తప్ప, ఆయన్నేమీ అనలేదు. ఇప్పుడా బాధలన్నింటినీ కడిగేశాడు. తనే మందు రాశాడు. ఉపశమనం కోసం, ఎచ్చి కథలూ, పిచ్చికథలూ చెప్పసాగాడు. ఇప్పుడు నేనతన్ని మరిచిపోలేదు. పైగా అప్పుడప్పుడు, మేం కలుసుకొన్నప్పుడు, "నాలాంటి వారింకా లక్షల సంఖ్యలో ఉన్నారు గదా; వారికి కూడా కాస్త చూడవయ్యా నాయనా!" అంటూ గుర్తుచేస్తున్నాను.

oooooooooo

మానవ జన్మ ఉత్తమమయిందనీ, ఉత్తమోత్తమమయిందనీ అంటుంటారు. వారంటున్న ఈ మాటలను సమగ్రంగా కాకపోతేమానె; సవ్యంగానయినా నేనర్థం చేసుకోలేకపోతున్నాను.

అన్నపురాసుల పక్కనే ఆకలి చావుల్ని నేనర్థం చేసుకోలేక పోతున్నాను. మహాసౌధాల పక్కనే, మురికి గుడిసెల్ని నేనర్థం చేసుకోలేకపోతున్నాను. ఒక మనిషి, తనలాంటి మరో మనిషిని, హతమార్చడం కోసం, సింహాల్ని, పులుల్ని, ఎలుగుబంట్లను, తోడేళ్ళను, వేటకుక్కల్ని,పాముల్ని, ఉసిగొల్పడమూ; ఆయుధాలను ఆసరా చేసుకోవడమూ నేనర్థం చేసుకోలేకపోతున్నాను.

oooooooooo

"పూవు నయిపోదామన్న ఉత్సాహంతో తీగమీద వాలాను. నేనంటే గిట్టని చివురాకు నన్ను కిందకి తోసేసింది"అన్నదా వాన చినుకు.

“దెబ్బ తగిలిందా చిన్నా!”అంటూ ఆ చినుకును మెత్తగా హత్తుకున్నదో మట్టిబెడ్డ.

ooooooooooo

“ఆ మబ్బులు మరీ అంత పచ్చగా ఉన్నాయెందుకని?”అన్నాడతను.

“ఇప్పుడే అడవుల మీంచి వస్తున్న ఆ మేఘాలకు, ఆ పాటి పచ్చదనం అంటుకోవడంలో ఆశ్చర్యమేముంది?”అన్నదా చిలక, ఆకుల మధ్యనించి అతన్ని చూస్తూ.

ooooooooooo

వారి కళ్లు గప్పాననీ, వీరిని మోసం చేశాననీ-నేననుకొంటున్నాను గానీ; అది - నా కళ్ళు నేనే కప్పుకోవడమనీ, నన్ను నేనే మోసం చేసుకోవడమనీ, నేనెందుకనుకోలేకపోతున్నాను?

ఆ మహారచనను అర్థం చేసుకొన్నాననీ, ఈ మహాత్మ్వికుని అవగాహన చేసుకొన్నాననీ-నేననుకొంటున్నాను గానీ; అది నన్ను నేనే అర్థం చేసుకోవడమనీ, నన్ను నేనే అవగాహన చేసుకోవడమనీ, నేనెందుకనుకోలేకపోతున్నాను?

పలానా వారికి సాయం చేశాననీ, ఫలానా ఫలానా వారికి అండగా నిలిచినానీ-నేననుకొంటున్నాను గానీ; అది-నాకు నేనే సాయం చేసుకోవడమనీ, నాకు నేనే అండగా నిలబడటమనీ, నేనెందుకనుకోలేకపోతున్నాను?

ooooooooooo

రాను రాను ప్రతి చిన్న అంశాన్ని గురించీ రకరకాల సందేహాలు ముసురుకొని,నన్నుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

ఒక్కో అడుగు ముందుకు జరుపుతున్న కొద్దీ, నూతనాంశాలు తెలియడానికి బదులుగా, అప్పటిదాకా తెలిసినదంతా “భ్రమ”అని తేలిపోతున్నది. కొత్త వెలుగులను కోరకుండా, అడుగు ముందుకు వేయకుండా, ఉన్నచోటనే ఉండిపోవడం వల్ల కొంచెం తృప్తి, మనశ్శాంతి మిగులుతుందనుకొంటున్నాను. ఇప్పుడిలా అనుకోవడం కూడా ఒక నూతనాంశమే గదా!

ooooooooooo

నేను-మరీ ఆశాపాతకుణ్ని కాదు గానీ, కాస్త మొండివాణ్ని. మెడలోతు ఊబిలో కూరుకుపోయినప్పుడు, వొడ్డెక్కగలిగితే చాలుననుకున్నాను. వొడ్డుమీద కొచ్చాక ఉన్న చోటనే ఉండిపోకుండా కాస్త ముందుకు జరగగలిగితే బావుండుననుకొన్నాను. అలా జరుగుతూ, జరుగుతూ మిట్టలమీదుగా, గుట్టల మీదుగా, కొంచెం ఎత్తుదాకా చేరగలిగాను. ఊబి నుండి ఇక్కడిదాకా ప్రయాణించడంలోని అనుభవాలను, పాత్రల పరం చేసి, చిన్నవీ, పెద్దవీ కథలు రాశాను. ఊబిలో ఉన్నప్పుడు నేను చూసింది కొంచెం, ఒడ్డుకొచ్చాక నాక్కనిపించింది ఇంకొంచెం. గట్టుమీంచీ, మిట్టమీంచి నేను చూడగలుగుతున్నది మరికొంచెం. ఇంకాస్త ఎత్తుకెళ్ళి, అక్కడ నించి కనిపించే ప్రపంచాన్ని కూడా అక్షరబద్ధం చేయాలని ఆశపడుతున్నాను.

ooooooooooo

విద్యాపరంగానూ, విజ్ఞానపరంగానూ,సంస్కారపరంగానూ, అధికారపరంగానూ, ఇంకా చాలా చాలా విషయాల పరంగా మీరు సంపన్నులు. ఈ రకరకాల సంపదలూ కలిసి

మిమ్ములనొక ఉన్నతోన్నతమయిన స్థానంలో నిలుపుతాయి. ఆ స్థానంలో నిలిచిన వారికి అన్ని విషయాలు తెలుసుననిపిస్తుంది. ఒకవేళ తెలియకపోయినా, చుట్టూ ఉన్నవారు తెలుసుననుకునేలాగా మిమ్ములను ఉబికించుతారు.

కొన్ని విషయాలు మీకు పిసరంత మాత్రమే తెలుసునని, ఇంకొన్ని విషయాలు ఆ పాటి కూడా తమకు తెలియవనీ నాకు తెలుసు. మీకు దరిద్రాన్ని గురించి తెలుసా? ఆకారణంగా ముసురుకొనే ఆకలిని గురించి తెలుసా? ఈ దరిద్రమూ, ఈ ఆకలీ, కలిసి మీ వ్యక్తిత్వాన్ని ఎలా చిన్నబుచ్చేది తెలుసా? నలుగురూ మిమ్మల్ని ఛీత్కరించడం తెలుసా? అలా ఛీ కొట్టినప్పుడు మనసు పడే ఆవేదనను గురించి తెలుసా? అంతదాకా అవసరం లేదు-మంచినీళ్ళు దాహం తీర్చడమే కాకుండా, ఆకలి మంటలను కూడా తాత్కాలికంగా చల్లార్చుతాయని తెలుసా? లేదు గదూ? ప్రభువు దయామయుడు! ఇలాంటి ఎన్నో విషయాలను గురించి లోతుగానూ, చిక్కగానూ తెలుసుకునే అవకాశం నాకు ప్రసాదించాడు.

oooooooo

''గాలి గారేమో, చండప్రచండంగా వీస్తూ, మహా తొందరపడిపోతున్నారు. అయినా ఆ మబ్బులు, కొండలమీంచి మెల్లగానే దిగుతున్నాయి. ఎందుకని?''అన్నాడతను.

''రాళ్లు రప్పలు గుచ్చుకుంటాయన్న భయంతో, ఆచితూచి అడుగులు వేస్తున్నాయి''అన్నదో గడ్డిపూవు.

oooooooo

''ఇదేమిటి కన్నా! ఇక్కడింతలా బొప్పి కట్టిందేం?''అన్నాడతను, మునివేళ్ళతో మృదువుగా నిమురుతూ.

''నేను ఏమరుపాటుగా ఉన్నప్పుడు, ఓ చిన్న శబ్దమొచ్చి మెత్తగా నన్ను తాకింది''అన్నదా నిశ్శబ్దం!

oooooooo

''నువ్వెందుకొచ్చావమ్మా? నిన్ను పిలవలేదే!''అన్నాడతను విసుగ్గా.

''మరీ-వొంటరిగా ఉన్నారనీ'' అన్నదా నిద్ర. అతని పక్కనే చతికిలపడుతూ.

oooooooo

''మెల్లగా పిలిచాను. పెద్దగా అరిచాను. మెల్లగా తట్టాను. గట్టిగా మొట్టాను. అయినా మేలుకోవు. ఏమిటా బండనిద్ర?''అని విసుక్కొన్నాడతను.

''నేను బండను గనుక''అన్నదా కొండ, బద్ధకంగా.

ooooooooo

ఒక వాక్యంలోని అర్థం నలుగురికీ నాలుగు రకాలలుగా ఎందుకు గోచరిస్తుంది?

ఒక సన్నివేశం తాలూకు నేపథ్యం, పదిమందికీ పదిరకాలుగా ఎందుకు అనిపిస్తోంది?

ఒక దృశ్యంలోని అంశం, ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా ఎందుకు కనిపిస్తుంది?

ఆ వాక్యంలోనూ, సన్నివేశంలోనూ, దృశ్యంలోనూ, భిన్నత్వం ఉండటమే

అందుక్కారణమా?

లేకపోతే-ఆ వాక్యాన్ని చదివిన వారి సంస్కారం, ఆ సన్నివేశాన్ని, ఆ దృశ్యాన్ని చూసిన వారి సంస్కారం కారణమా?

కాకపోతే, వారెన్నుకొన్న దృక్కోణాలు కారణమా? కాక-ఇవన్నీ కారణమా?

oooooooo

పదిమందిలో ఉన్నప్పుడు, మనం మర్యాదగా, మృదువుగా, ఉదారంగా, నిర్మలంగా ఉంటాం. కనీసం అలా ఉన్నట్లు కనిపించడానికి ప్రయత్నిస్తాం. ప్రచారమాధ్యమాలు చుట్టూ ఉన్నప్పుడూ, దేశీయులో, విదేశీయులో మనచుట్టూ ఉన్నప్పుడూ, మన ఉదారత్వమూ, మృదుత్వమూ, నిర్మలత్వమూ మరింత మెరుగులీనేట్టు చేయడానికి ఇంకాస్త ఎక్కువ శ్రమపడతాం. మరికాస్త తీయని భాషను వాడతాం. ఏమహాత్ముల్లో ఏ సందర్భంలోనో చెప్పిన వాక్యాలను పదేపదే ఉచ్ఛరిస్తాం. చుట్టూ ఉన్నవారిక కరతాళధ్వనులతో పరిసరాలు కదిలిపోయిందాకా విశ్రమించం. ఇంత మర్యాదగా, మృదువుగా, ఉదారంగా, నిర్మలంగా-ఏకాంతంలో కూడా మనం ఉంటున్నామా?

oooooooo

ఒకప్పుడు-కొన్ని కొన్ని విషయాలు, నాకు సులభంగా అర్థమవుతూ ఉండేవి. రానురాను, చాలా విషయాలు జటిలంగా తయారవుతున్నాయి.

ఒకప్పుడు-తమను కన్నవారిని ఆప్యాయానురాగాలతో చూసుకొన్నవారు; ఇప్పుడు వారినే -వీధుల్లోకి తరుముతున్నారెందుకు?

ఒకప్పుడు -అందరినీ, అన్నిటినీ, నిస్సంకోచంగా, నిర్భయంగా విశ్వసించినవారు; ఇప్పుడు ఎవ్వరినీ, దేనినీ నిండుగా, నమ్మలేకపోతున్నారెందుకు? మనుష్యుల మధ్య ఉండవలసిన ఆప్యాయతలు అనురాగాలు, క్రమంగా లుప్తమయిపోతున్నాయెందుకు? మిగిలిన ఆ చిటికెడయినా, ఆ పిడికెడయినా, ''ఆర్థికం''చుట్టూ ''ప్రయోజనం''చుట్టూ తిరగుతున్నాయెందుకు?

oooooooo

''అన్నిటికీ ప్రారంభం ఉంటుంది. ప్రారంభమున్న వాటన్నింటికీ ముగింపు కూడా ఉంటుంది''అనుకునేవాణ్నొకప్పుడు.

ఇప్పుడలా అనుకోలేకపోతున్నాను. ''నేర్చుకోవడం''అన్నదానికి ప్రారంభం ఎక్కడ? ముగింపు ఎక్కడ?

అందరి నుండీ, అన్నిటి నుండీ, నేర్చుకొంటూ పోగా పోగా పోగా; ఈ ''నేర్చుకోవడం'' అన్నదానికి అవసరం అన్నది ప్రారంభమనీ, ''ముగింపు''అన్నది లేనేలేదనీ ఇప్పుడే నేర్చుకున్నాను. ''ఆద్యంతరహితమయిన, ఈ చరాచర జగత్తు''లో ''నేర్చుకోవడం''అన్నదొక అతిసూక్ష్మమయిన, అతిసున్నితమయిన, అతి ముఖ్యమయిన అంశమనీ నేర్చుకొ(ంటు)న్నాను.

oooooooo

"స్వేచ్ఛ, స్వేచ్ఛ"అంటూ తపించిపోతున్న వారందరూ అది లేక బాధపడుతున్నవారే"ననుకోవడం, ఎంతవరకూ సమంజసం?

ఇలా నినదిస్తున్న వారందరకూ, ఎలాంటి "స్వేచ్ఛ"కావాలి? దేని నుండి "స్వేచ్ఛ"కావాలి?

ఆర్థిక బంధాల నుండి స్వేచ్ఛ కావాలి? వ్యక్తిగత సంబంధాల నుండి స్వేచ్ఛ కావాలా? ఆలోచనల నుండి స్వేచ్ఛ కావాలా? ఆకలి నుండి, అజ్ఞానం నుండి స్వేచ్ఛ కావాలా? ఆచారాల నుండి విశ్వాసాల నుండి, సంప్రదాయాల నుండి స్వేచ్ఛ కావాలా? ఈ దేహం నుండి స్వేచ్ఛ కావాలా? నీ నుండి నీకే స్వేచ్ఛ కావాలా?

నీవెక్కడికెళ్ళాలో, నీకేస్పష్టంగా తెలీనప్పుడు, నీవెక్కడికయినా ఎలా ప్రయాణం చేయలేవో; నీకెలాంటి స్వేచ్ఛకావాలో నీకే ఖచ్చితంగా తెలీనప్పుడు నీవెలాంటి స్వేచ్ఛనూ పొందలేవని నేననుకొంటున్నాను.

oooooooo

"బాగా అలిసినట్టు కనబడుతున్నాను. దూరం నించీ గానీ వస్తున్నారా?"అని పలకరించాను వారిని.

"మరీ అంత దూరమేమీ కాదు గానీ; ఇటు నామీద వాలే వెలుతురును మోయలేకా, అటు నా నీడలను నేనే నడిపించలేకా సతమతమయిపోతున్నాను బాబుగారూ"అన్నదా మబ్బు ముక్క ఆపసోపాలు పడుతూ.

oooooooo

"అతను మిమ్మల్ని పూజించడు, అర్చించడు. మీ ఆలయానికి రాడు. కనీసం-మిమ్మల్ని తలుచుకోనన్నా తలుచుకోడు. అయినా అతనంటే మీకు వల్లమాలిన ప్రేమ. అమితమయిన అభిమానమూను. ఎందుకట్లా?"అని అడిగాను ఈశ్వరుణ్ని.

"పదిమందికీ ఉపకరించే సత్కార్యాలు చేస్తుంటాడు గనుక!" అన్నాడు ప్రభువు నా చెవి మెలిపెడుతూ.

oooooooo

ఈ చెరువుకూ, ఆ కొండకూ ఏ అంశం దగ్గర తగాదా వచ్చిందో నాకు తెలీదు. తన నీడనయినా చెరువు దగ్గరకు వెళ్ళనీయడం లేదా కొండ. ఆ కొండగారి ప్రతిబింబాన్ని కూడా తనదాకా రానివ్వడం లేదా చెరువు!

oooooooo

తను ఎండలకెండుతూ, వానలకు తడుస్తూ, తన నాశ్రయించుకొన్నవారికి నీడలనిస్తూన్నది చెట్టు. తనకవసరం లేకపోయినా, పూలను పూస్తూ, కాయలను కాస్తున్నది చెట్టు. సమస్త ప్రాణులూ వొదిలే బొగ్గుపులుసు గాలులను తను పీల్చుకొని,వారికి ప్రాణవాయువులను దానమిస్తోంది చెట్టు. మిగిలిన ప్రాణికోటి విసర్జించిన వాటినే తను ప్రాణాధారం చేసుకొని, మిగిలిన ప్రాణులకవసరమయిన పత్రాలనూ, పుష్పాలనూ, ఫలాలనూ, వాయువులనూ,

నీడలనూ ప్రసాదిస్తున్న చెట్టును చూసి, నేనేం నేర్చుకొన్నాను?

oooooooo

నేననుకొన్నట్లుగా జీవించడం లేదు. నాకు వీలుపడినట్లుగా మాత్రమే జీవిస్తున్నాను. ఈ జీవితంలో కొంతభాగం, నామీద ఆధారపడిన వారి సంక్షేమం కోసం వినియోగిస్తున్నాను. మరికొంత భాగం నా చుట్టూ ఉన్నవారికి, నేను నచ్చడం కోసమూ, నన్నువారు మెచ్చుకోవడం కోసమూ వినియోగిస్తున్నాను. అక్షరాలా నాకు నచ్చినట్టుగా నేననుభవిస్తున్న జీవితం, చాలా స్వల్పం.

ooooooooo

నా గతాన్ని నేనెప్పుడూ మరచిపోలేను. నాకన్నా నికృష్టంగా బతికినవారూ, బతుకుతున్నవారూ నా చుట్టూరా ఉన్నప్పుడు, వారిని చూస్తూ కూడా; వారిలాగే ఒకప్పుడు బతికిన నన్ను నేనెలా మర్చిపోవాలో, నాకిప్పటికీ బోధపడకుండా ఉంది.

అలాగని-నేను కుంగిపోవడమూ లేదు. నా గతంకాన్న, నా భవిష్యత్తు రవ్వంత మెరుగ్గా ఉండడం కోసం, నా వర్తమానాన్ని సద్వినియోగం చేసుకొంటున్నాను.

oooooooo

ఆ మహాభక్తుడు మోయలేనన్ని పూజాద్రవ్యాలను మోసుకొంటూ, తడబడుతూ, ఆయాసపడుతూ దేవాలయం వేపు నడుస్తున్నాడు. అతనికి సాయం చేద్దామన్న సదుద్దేశంతో, చాలా బరువుల్ని నేనందుకొన్నాను. వారితో బాటే దేవాలయం ప్రాంగణంలోకి అడుగు మోపాను!

''కృతజ్ఞుణ్ణి''అన్నారాయన సామాను అందుకుంటూ.

''ఆ మాట అనవలసినవాణ్ని నేను. మీకారణంగా నాకు ఈశ్వర దర్శనం లభించింది''అన్నాను వారికి నమస్కరిస్తూ.

oooooooo

''కారు చీకట్లో కునారిల్లిపోతున్న వారికింత కాంతి నివ్వగలిగినందుకు, ఆనందించడానికి బదులుగా కుమిలిపోతున్నావెందుకు?''అన్నదో చిట్టెలుక ఆ దీపం వేపు చూస్తూ.

''ఎవరెవరు, ఎక్కడెక్కడ నిద్రపోతున్నారో, ఏయే వస్తువులు ఎక్కడెక్కడున్నాయో ఓ దొంగకు చూపడం కోసం మాత్రమే నా వెలుతురు ఉపయోగపడుతున్నందుకు బాధగా ఉండదా?''అన్నదా దీపం గుటకలు మింగుతూ.

oooooooo

చూడడం వేరు, నిశితంగా చూడడం వేరు. చూశాక, వాటి అంతస్సారాన్ని అవగాహన చేసుకోవడం వేరు.

అధిక సంఖ్యాకులకు చూడడం తెలుసు. కొంతమందికి నిశితంగా చూడడం తెలుసు. బహుకొద్దిమందికి అంతస్సారాన్ని అవగాహన చేసుకోవడం తెలుసు.

జలధూళిగా సాగరాలపైకెగసిన నీటి నలకల్ని సేకరించి, మేఘాలుగా మలిచి, భూమండలం దాకా మోసుకొచ్చి, ఆ నలకలన్నింటినీ, బండలమీద, కొండలమీద, అడవులమీద

వర్షించిన వాయుదేవుడు; తనకోసం వొక్క నీటిచుక్కనయినా దాచుకోడు.

బండలమీద, కొండలమీద, అడవుల మీద రాలిన వాన చినుకుల్ని ఊటలుగా, జాలులగా, వాగులుగా, వంకలుగా సేకరించి; నదులుగా మలిచిన ప్రవాహం; ఒక్క గుక్కెడు నీళ్ళయిన తాగదు.

నీటి తేమను, భూసారాన్ని ఆధారం చేసుకొని ఎదిగి, పెదిగి, విస్తరించిన ఆ పూలమొక్క; వొక్కపూవునూ తాను అలంకరించుకోదు; ఆ ఫలవృక్షం, ఒక్క పండునూ తాను తినదు.

ఆ వాన మబ్బునూ, ఈ కొండ వాగునూ, ఆ పూలమొక్కనూ, ఈ పళ్ళ చెట్టునూ ఆరు దశాబ్దాలుగా చూస్తున్నాను. వాటికున్న దానగుణంలో శతాంశం కాదు;సహస్రాంశం కూడా నాకు అబ్బలేదు. నేనేం నేర్చుకొన్నట్టు?

ooooooooo

ఇది నా చిన్నప్పటి కొండ కాదు. ఆ కొండ-నన్ను చూస్తూనే సన్నగా నవ్వేది. దగ్గరకు రమ్మని సైగ చేసేది.

''ఏమన్నా తిన్నావా?''అని ఆప్యాయంగా అడిగేది.

''తినలే''దని చెప్పడానికి అభిమానం అడ్డుపడి, మౌనంగా వుండిపోతే; లోయలో తాను పండించుకున్న సీతాఫలాలను, నాగజెముడు గుబ్బలను, సీమతుమ్మకాయలను, నాముందు కుప్పలా పోసేది. నన్నుత్సాహపర్చడానికి గాలిని పిలిచి, ఈలపాటలు పాడమనేది. సీతా చిలుకల్ని, తూనీగల్ని బృందనాట్యం చేయమనేది.

ఇప్పటికొండ, నన్నుగుర్తుపట్టినట్టే లేదు. పాత సంగతులు జ్ఞాపకం చేసినా మౌనంగా ఉండిపోయింది.

నాకు ఏడుపొచ్చింది. నేను మారిపోయానా? నా కొండ మారిపోయిందా?

ooooooooo

''నీడ కింద హాయిగా ఉండడానికి బదులుగా ఈ పచ్చిక మైదానం ఇలా ఆయాసపడుతోందెందుకని?''అన్నదో కొంగపిల్ల పక్కనే ఉన్న తంగేడు పూవుతో.

''నేను మోస్తున్నది మామూలు నీడ కాదు; కొండనీడ. బరువుగా ఉండదా?''అన్నదా మైదానం కొంగపిల్ల వేపు కోపంగా చూస్తూ.

ooooooooo

ఇక్కడున్న నేనూ, అక్కడున్న నెలవంకా, హాయిగా కబుర్లాడుకొంటున్నాం. మా కమ్మని కబుర్లు విని, కడుపు మండిన గోండ్రు కప్ప చెరువులోకి కాలు మోపింది. అలలు లేచాయి. నెలబాలుడు విరిగిపోయాడు.

ooooooooo

''మీరింత నిర్భయంగానూ, నిస్సంకోచంగానూ, నిర్వికారంగానూ ఎలా ఉండగలుగుతున్నారు? అది రహస్యం కాకపోతే నాకూ చెప్పండి. రకరకాల సమస్యలతో, ఆశలతో, వాటిని సఫలీకృతం చేసుకోడానికి పడే పాట్లతో విసుగెత్తిపోతున్నాను. అలసిపోతున్నాను''అని

అభ్యర్థించాను.

"పోగొట్టుకోవడానికి నా దగ్గరేమీ లేవు. అన్నింటినీ జయించాను"అన్నారు వారు చిరుగా నవ్వుతూ.

"అన్నింటినీ జయించానన్న అహంకారమూ, ఆత్మవంచనా వారిలో పుష్కలంగా ఉ న్నా"యనీ, అలా ఉన్న సంగతి కూడా తెలియనంత మూర్ఖంగా వారు బతుకుతున్నారనీ, అప్పుడు గానీ నేను తెలుసుకోలేకపోయాను.

oooooooo

నేననుకొన్నదంతా నాకు తెలిసిన పదాలలో పొదిగానా, లేదా, అన్నది ముఖ్యం! అలా పొదిగిన దాన్ని చూసి, నేననుకొన్నదేమిటో అవతలివారు గ్రహించారా, లేదా, అన్నది కూడా ముఖ్యమే! "ఎంత మంది చదివా?"రన్నది అంత ముఖ్యం కాదు. అసలెవ్వరూ చదవకపోయినా వారిని తప్పు పట్టను. అందరూ చదివేలాగా; చదివి అర్థం చేసుకొనేలాగా రాయలేకపోవడం, నా తప్పుగానీ, అవతలి వారి తప్పెలా అవుతుంది?

oooooooo

"ఎంతోమంది, ఎన్నెన్నో విషయాలను గురించి, సుదీర్ఘంగా ఉపన్యసించారు. మీరు మాత్రం మౌనంగా ఉండిపోయారెందుకని?"అన్నాను, వారివేపు జరుగుతూ.

"నా కన్నా ముందు మాట్లాడిన వారి నుండి చాలాపాఠాలు నేర్చుకొన్నాను. నేర్చుకొంటున్నాను. నేను విద్యార్థినే గానీ, అధ్యాపకుణ్ని కాదు"అన్నారు వారు.

నేనిప్పుడు విద్యార్థినయ్యాను!

oooooooo

"ఉదయం నిన్ను చూసినప్పుడు, నాకు జాలివేసింది. ఆకులన్నీ రాలిపోయాయి. రెమ్మలు, కొమ్మలు ఎండిపోయాయి. ఇవ్వాళో, రేపో, నిన్ను తొలగించుతారని బాధపడ్డాను. ఇప్పుడు చూస్తుంటే, నాకే ఆశ్చర్యమేస్తున్నది. "నీవు నీవేనా? నేను నేనేనా?"అనిపిస్తున్నది. ఇలా పచ్చగిల్లిలపోయావేం? నీ రెమ్మలు, కొమ్మలు, నవనవలాడుతున్నాయెందుకని?"అన్నదా ఉడత.

"ఎదురింట్లోకి ఈ ఉదయమే ఎవరో అద్దెకొచ్చారు. ఓ పెద్దాయన మనవరాలు నా దగ్గరకొచ్చింది. నన్ను పలకరించింది. పాదు చేసి కాసిని నీళ్ళు పోసింది. ఆ బంగారు తల్లి పేరు వసంత..."అన్నదా చెట్టు.

oooooooo

ఓ పిడికెడు సంతోషం కోసమూ, మరో చిటికెడు ఆనందం కోసమూ, నేను-చాలాకాలంగా, చాలాచోట్ల వెదికాను. వెదికి వెదికి విసుగెత్తిపోయినప్పుడు, వారు కనిపించారు. కనిపించి నన్నడిగారు. నేను-దాచుకోకుండా చెప్పాను. నా సమాధానం విని, వారు నన్ను జాలిగా చూశారు.

"నన్ను నమ్మండి! నేను వాటికోసమే అన్వేసిస్తున్నాను"అన్నాను ప్రమాణం చేస్తూ.

"నీ క్కావలసిన ఆ రెండూ, నీకు వెలుపల లేవు కన్నా! నీలోనే ఉన్నాయి. నీకు నీవు

దూరమయి, ఎక్కడెక్కడ ఎంతెంత కాలం వెదికినా; నీలో ఉన్న ఆ రెండూ నీకెలా కనబడతాయి? నీకు నీవు దగ్గరవ్వాలి. నీలోకి నీవు చూసుకోవాలి!''అన్నారు స్వామి పరమానంద.

oooooooo

ఎవరు నమ్మినా, నమ్మకపోయినా, కొన్ని నిజాలను మీ ముందుంచుతున్నాను. ఎంత వొదిగొదిగి బతుకుతున్నా నాకింకా శత్రువులున్నారు. అప్పుడప్పుడు వీరి దర్శనమవుతూ ఉంటుంది. ఎంత జాగ్రత్తగా ఉన్నా అప్పుడప్పుడు సుస్తీ చేస్తుంటుంది.

నా శత్రువు గారి పేరు అసూయ.

నా సుస్తీగారి పేరు నిరాశ.

oooooooo

''ఎంతో ఆపేక్షగా ఆకాశం వేపు చూస్తున్నారు. చూస్తూ చూస్తూ సన్నగా నిట్టూరుస్తున్నారు. మీవారెవరన్నా అక్కడున్నారా?''అన్నదా కొత్తకోడలు నీళ్ళబిందెను శుభ్రం చేస్తూ.

''ఆ పయోతలం నా పుట్టిల్లు. ఈ ఇలాతలం నా అత్తిల్లు. నేనిక్కడి కొచ్చి కూడా శతాబ్దాలు గడిచిపోయింది. ఇక్కడ నాకే కొదువా లేదు. అయినా పుట్టినింటి మీది మమకారాన్ని నేనిప్పటికీ పోగొట్టుకోలేకపోతున్నాను''అన్నదా చెరువమ్మ దిగులుగా మబ్బులకేసి చూస్తూ.

oooooooo

''సుఖంగా ఉన్నారా?''అని పలకరించాడతను.

''సుఖమూ లేదు, పాడూ లేదు. ఎండలకు ఎండిపోతున్నాను. వానలకు నానిపోతున్నాను. చలికి వణికిపోతున్నాను. రాత్రి పొద్దుబోయిందాకా పిట్టల గోలతో విసిగిపోతున్నాను. మళ్ళా వేకువనుండీ పక్షుల సందడి ప్రారంభమవుతుంది పూలకోసం, కాయలకోసం, నీడలకోసం వొచ్చేపోయే వారితో పగలంతా సరిపోతుంది. పోనీ రాత్రయినా, కాసేపు విశ్రాంతి తీసుకుందామనుకుంటే, బాగాపొద్దుపోయాక ఎవరెవరో వస్తారు. ఏవో గుసగుసలాడుకుంటూ ఉంటారు. ఇంక నాకు సుఖమెక్కడేడిసింది బాబుగారూ?''అన్నదా చెట్టు.

అతను నవ్వాడు.

''నేను అబద్ధం చెప్పలేదే!''అన్నదా చెట్టు.

''మీరు చెప్పింది అక్షరాలా సత్యం. మీరేమో, సంపన్నమైన దారిద్ర్యంతో బాధపడుతున్నారు. ఆ గడ్డిపరక రెండు చుక్కల నీటితో సుఖంగా జీవిస్తున్నది!''అన్నాడతను.

oooooooo

కొత్త సంవత్సరం నాడు నన్ను నేనోసారి పరిశీలించి చూసుకున్నాను. ప్రభువు నాకు చాలా ఇచ్చాడు. వాటిలో కొన్నింటిని నేను అడిగాను. ఇంకొన్నింటిని నేనడగకుండానే ప్రసాదించాడు.

అయినా-నాకు తృప్తి లేదు. ఈ అసంతృప్తి కూడా, ప్రభువు నాకిచ్చిందే! అప్పుడెప్పుడో, ఓ ముద్ద అన్నం దొరికితేనే చాలుననుకొన్నాను. ఓ జానెడు గుడ్డ, బారెడు నీడ దొరికితే చాలుననుకున్నాను. నన్ను నమ్ముకొని, నా జీవితంలోకి వచ్చిన భార్యకు, ఆమెగారు నాకిచ్చిన

బిడ్డలకు ఏ లోపం జరగకుండా ఉంటే చాలుననుకొన్నాను. ఇవన్నీ ఈశ్వరుడు నాకిచ్చాడు.

అలా ఇవ్వడం వల్లనే కావచ్చు,నా ఆకలి ఇంకా పెరుగుతున్నది. ఈ కొత్త సంవత్సరంలో నేనో కొత్త కోరికల పట్టికను తయారుచేశాను. అందులో మొదటిది: నా అణువణువూ కారుణ్యంతో నిండిపోవాలి. రెండవది:బాధితుల కన్నీరు తుడిచే సదవకాశాలు అధికాధికంగా లభించాలి. మూడవది: దుఃఖితులను, ఆర్తులను హృదయానికి హత్తుకొనే అదృష్టం కావాలి. ఈ మూడింటిని ప్రసాదించమని ప్రభువును వేడుకొంటున్నాను!

oooooooo

'జ్ఞాపకం' గతానికి సంబంధించింది గదా! అది పాతబడి ఉంటుందనీ, పెచ్చులూడి ఉంటుందనీ, గట్టిపడిగానీ, గుల్లగుల్లగా ఉసిలిపోయి గానీ ఉంటుందనీ, అనుకొన్నాను. అలాంటిది-ఎంతో తాజాగా, చాలా మెత్తగా, నవనవలాడుతూ ఉన్నావెందుకనీ?''అన్నాడతను, ఆ స్మృతి వేపు చూస్తూ.

''కాలానికి అతీతమయిందీ జ్ఞాపకం. ఎప్పుడూ వర్తమానంలోనే ఉంటుంది. అంచేత పాతబడడం గానీ, గట్టిపడడం గానీ, ఉసిలిపోవడం గానీ జరిగే అవకాశమే లేదు. ఇక మృదువుగా ఉండటమంటారా? చిరకాలంగా అశ్రువుల్లో నాని నాని నాని, అలా మెత్తగిలిపోయింది!''అన్నదా పరిమళ వీచిక, ఆ జ్ఞాపకం వేపు ఆర్ద్రంగా చూస్తూ.

oooooooo

చెబుతున్నదెవరు? వింటున్నదెవరు? చెబుతున్నవారు, తమకేదో తెలుసుననే చెబుతున్నారా? వింటున్నవారు, తమకేమీ తెలియదనే వింటున్నారా? దేనిని గురించి చెప్పినా, ఎంత చెప్పినా, ఎవరు చెప్పినా ఇంకా చెప్పవలసింది అపారంగా ఉంటుందన్న స్పృహతోనే చెప్పేవారు చెబుతున్నారా? తమ వద్ద అనల్పమయిన జ్ఞానసంపద ఉన్నదని, ఎదుటివారిని నమ్మించడం కోసమని చెబుతున్నారా? వింటున్న వారు నిజంగానే, ఏమీ తెలీనివారా? లేకపోతే చెబుతున్నవారిని నిరుత్సాహ పరచడం ఇష్టం లేక, శ్రద్ధగా వింటున్నట్టు నటిస్తున్నారా? చెబుతున్న వారిలో కొండంత జ్ఞానం, ఉండంత అజ్ఞానం ఉంటే; వింటున్న వారిలో ఉండంత జ్ఞానం, కొండంత అజ్ఞానం ఉంటుందా? ''ఎవ్వరూ పూర్తి జ్ఞానులు కారు. పూర్తి అజ్ఞానులూ కారు''అనడం సత్యమేనా? అయితే అది, పూర్ణ సత్యమా? పాక్షిక సత్యమా? ఎవరినడగను? ఎవరు చెబుతారు?

oooooooo

''మరీ-అంత మొద్దు నిద్రేమిటి?''అన్నాను గట్టిగా తట్టుతూ.

''పగలంతా ఎండలకు అలసిపోతుంటాను. సాయంకాలమయ్యేసరికి ఈ తరంగాలేమో, చల్లగా జోకొడుతుంటాయి. ఆపుకొందామన్నా ఆగలేక కళ్ళు మూతలు పడతాయి. నాకు తెలీకుండానే, గాఢనిద్రలోకి జారిపోతుంటాను''అన్నదా చెరువు గట్టు, బద్ధకంగా ఆవలిస్తూ.

oooooooo

''నన్ను మండించాలని నీవూ, నిన్ను మసిచేయాలని నేనూ, సహస్ర సహస్రాబ్దాలుగా

తంటాలు పడుతున్నాం. నేను మండిపోనూ లేదు; నీవు మసికుప్పగానూ మారిపోలేదు. ఈ హెూరాహెూరీ పోరాటం అనంత కాలాల దాకా, అవిచ్ఛినంగా సాగుతూనే ఉంటుంది''అన్నదా అంధకారం, దూరం నించి వొస్తోన్న వెలుతురు వేపు చూస్తూ.

oooooooo

"ఇక్కడ సిరిసంపదలున్నాయి. వాటినానుకొని పదవులున్నాయి. ఆ పదవుల్ని వొరుసుకుంటూ అధికారాలున్నాయి. అధికారాల ప్రక్కనే కీర్తి ప్రతిష్ఠలున్నాయి. ఆ పక్కగా, వైభోగాలున్నాయి వీటిల్లో నీవేని కావాలన్నా ఇస్తాను. ఇవన్నీ కావాలన్నా ఇస్తాను''అన్నాడు ప్రభువు.

"మన్నించండి!" అన్నాడా భక్తుడు.

"ఎందుకట్లా?" అన్నాడు ప్రభువు.

"ఇవన్నీ మీరెందుకిస్తున్నట్టు?" అన్నాడతను.

"అనాధలకు, ఆర్తులకు నీవు చేసిన సేవలను గమనించాను. నీలోని దయాగుణం నన్ను కదలించింది''అన్నాడు ప్రభువు.

"నాన్నా! మీరివ్వగలిగినంత ఎక్కువగా, ఆ దయాగుణాన్ని నాకు ప్రసాదించండి''అన్నాడా భక్తుడు.

ఎందుకోగానీ, ప్రభువు నేత్రాలు అశ్రుతప్తాలయినాయి.

oooooooo

"చాలా కాలంగా నేనీ చెరువును చూస్తున్నాను. నాకు తెలిసినప్పటి నుండీ వీరు-తెల్లగా, చల్లగా, నిర్మలంగా ఉంటున్నారు. కొంతకాలంగా, వీరిలో ఏవో మార్పులొస్తున్నట్టు నాకనిపిస్తున్నది. అద్దంలా స్వచ్ఛంగా, పారదర్శకంగా, ఉండే ఈ తటాకజలాలు, పలచని పసిమిరంగులోకి, మెరిసే మిసిమి రంగులోకి మారుతున్నట్లనిపిస్తున్నది. కారణం నాకు తెలీడం లేదు''అన్నాడతను.

గట్టుమీది రావి చెట్టు-ముందుగా, సన్నగా నిట్టూర్చింది. తరువాత నిశ్శబ్దంగా రేవు వేపు చూసింది.

అతనూ అటువేపు చూశాడు.

నీళ్ళ కడవను, నెత్తికెత్తికుంటున్న ఓపుత్తడిబొమ్మ కనిపించింది! తెల్లగా, తెలతెల్లగా ఉండే చెరువు నీరు, సౌవర్ణ వర్ణంలోకి ఎందుకు మారుతున్నదీ అప్పటిగ్గానీ, అతనికి బోధపడలేదు.

oooooooo

బతకడం కోసం-సుఖంగా బతకడం కోసం ఆలోచిస్తాం. ఆలోచించాక, వాటికొక కార్యరూపాన్ని సంతరించుకొంటాం. సంతరించుకొన్నాక ఆ కార్యాన్ని ఆచరణలో ఉంచడానికి, పాకులాడుతుంటాం. ఆ పాకులాటలో తరచుగా జారిపడుతూ ఉంటాం. అలా జారిపడిన ఊబిలోంచి బయటపడేందుకు, మరొకరి సాయాన్ని కోరుకుంటాం. అలా-జారిపడుతూ, పైకి లేస్తూ, కొత్త చిక్కులను ఎదుర్కొంటూ సాగిపోతూ ఉంటాం. ఈ మహాప్రస్థానంలో, మనం

పోగొట్టుకొంటున్నవేమిటి? రాబట్టుకొంటున్నవేమిటి?

కష్టాల నుండి బయటపడేందుకోసం మనం చేసే ప్రయత్నాలలో, మనకున్న కాసిని సుఖాలను పోగొట్టుకుంటున్నామా? లేక అలా పోగొట్టుకోవడం ద్వారా లభించే అనుభవానందం కోసమే అలా చేస్తున్నామా?

00000000

"అవి కావలనీ, ఇవి కావాలనీ, ఏవో కావాలనీ, ఏవేవో కావాలనీ, ఇంకా ఇంకా కావాలనీ, నేనడుగుతూనే ఉన్నాను. మీరిస్తూనే ఉన్నారు. నామీద మీకెందుకింత దయ స్వామీ!"అన్నాడా భక్తుడు.

"ఇప్పుడింకేమన్నా కావాలా?"అన్నాడు ప్రభువు.

"లేదు" అన్నాడు భక్తుడు చేతులు జోడించి

"లేక-నువ్వడిగావు. ఉండి-నేనిచ్చాను. అయినా ఏం లాభం? ఇప్పుడా నీవు 'అడగడానికి కూడా ఏమీలేనంత పేదవు' గానే మిగిలిపోయావు. నిన్ను చూస్తే నాకు వల్లమాలిన జాలి; ఎందుకంటే -నీకేం కావాలో నీకే తెలియనంత పిచ్చినాన్నవు గనుక!"అన్నాడు ప్రభువు, అతన్ని ఆప్యాయంగా హత్తుకుంటూ.

00000000

"నాకా మొక్కంటే చాలా ఇష్టం. అది-రెండు బండల మధ్య గల నెరియలోంచి పుట్టుకొచ్చింది. తన చుట్టూ ఉన్న ప్రతికూల వాతావరణాన్ని, తనకు అనుకూలంగా మార్చుకుంది. అది సాధ్యం కానప్పుడు ఆ వాతావరణానికి అనుకూలంగా, తనను తానే మార్చుకుంది. మిగతా మొక్కల్లాగా, దేనికీ, ఎవరిమీదా ఆధారపడలేదు. చేసిన పోరాటాలన్నీ ఒంటరిగానే చేసింది"అన్నాను నా మిత్రునితో ఆ మొక్కను చూపిస్తూ.

అంతా విని ఆ మొక్క నవ్వింది.

"ఎందుకు నవ్వుతావ్? నేను చెప్పింది అబద్ధం కాదే!"అన్నాను.

"నన్నడ్డం పెట్టుకొని, నీ గురించి నీవు చెప్పుకొంటున్నావనిపించి నవ్వాను"అన్నదా మొక్క, నా వేపు సాభిప్రాయంగా చూస్తూ!

00000000

నేను, మరీ వొంటరిగాలేను!

అవిద్య, అజ్ఞానం, ఆకలి, ఆత్మీయతారాహిత్యం, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బంది, అవమానం, అంతరిక సంక్షోభం, అశ్రువుల వంటివెన్నో నాకు తోడుగా ఉన్నాయి.

00000000

"నువ్వింత అబద్ధాలకోరువని, నాకిప్పటిదాకా తెలీదు. ఇంతకాలంగా నీవు చెబుతున్నవన్నీ నిజాలేననుకొన్నాను. అనుకొని నన్ను నేను వంచించుకొన్నాను"అన్నదా అద్దం రుసరుసలాడుతూ.

"అబద్ధాలు, నేను చెప్పానా?"అన్నాడతను ఆశ్చర్యపోతూ.

"నువ్వే మోసం చేశావు. దగా చేశావు. ఈ అకాశం అనంతమయిందన్నావు. ఈ ఆకాశం

నిండా ఉపగ్రహాలు, గ్రహాలు, నక్షత్రాలు, నక్షత్రమేఘాలు, నక్షత్ర మండలాలు క్రిక్కిరిసి ఉన్నాయన్నావు. నీ మాటలు నమ్మి వాటిని సాదరంగా ఆహ్వానించాను. ఓ గుప్పెడు చిన్న చిన్న వెలుతురు నలకలు మాత్రమే నాదాకా వచ్చాయి. తమరింత దాకా ఊదరకొడుతున్న నక్షత్రమేఘాలు, నక్షత్ర బ్రహ్మాండాలు ఇవేనా?''అన్నదా దర్పణం.

అతను తలవొంచుకొన్నాడు.

''అప్పుడెప్పుడో, 'సముద్రమంటే ఇంతేనా?''అన్నాను. నీ దోసిలి నిండా నింపుకొన్నా సాగరజలాలను చూస్తూ, 'నీకు సంబంధించినంత వరకు ఇంతే' అన్నారెవరో! అదే సమాధానాన్ని అద్దంగారికి నీవు చెప్పు!''అని వినిపించింది మృదువుగా.

అలా అన్నవారిని చూడడం కోసం అతను చుట్టూ చూశాడు.

''నేను మీకు వెలుపల లేను. మీలోనే ఉన్నాను. నాపేరు జ్ఞానం''.

oooooooo

ఉత్తములయిన వారితో, కొన్ని పేచీలున్నాయి. నాలాంటి సామాన్యులందరికీ ఈ ఉత్తములయినవారు, ఆదర్శమూర్తులుగా ప్రకాశిస్తూ ఉంటారు. వారి స్థాయిని అందుకోవాలన్న తపనతో నాకున్న మనశ్శాంతి కాస్తా హరించుకుపోతుంది. స్థాయినందుకోవడం భగవంతునికి తెలుసు. కనీసం స్నేహం చేద్దామన్నా సాధ్యపడదు. కాకపోతే, అతి ప్రయత్నం మీద కొంచెంగా దగ్గరగా జరగగలం. పోనీ-విరోధం పెట్టుకొందామన్నా కుదిరి చావదు. తగాదా పెట్టుకోడానికి నేను-సిద్ధంగానే ఉంటాను. అవసరమయితే కవ్విస్తాను కూడా. కానీ-నేనేం చేసినా, చిరునవ్వుతో నా వేపు చూసే వారిని నేనెలా జయించను?

oooooooo

''తెల్లగా, చల్లగా, మెల్లగా పోతూపోతూన్నవారు కాస్తా; హఠాత్తుగా ఆగిపోయారెందుకు? కళ్ళు చికిలించి కిందికి చూస్తున్నారెందుకు?''అన్నదో గోరింక.

''పల్లెకు దూరంగా ఉన్న, ఆ పూరింటి ముందు, ఓ అమ్మాయిగారు; అద్దం పుచ్చుకుని నుంచున్నారు. అందులో ప్రతిఫలిస్తున్నది నా ముఖమో, అమ్మాయిగారి ముఖమో తేల్చుకోలేకాగిపోయాను''అన్నాడా పున్నమి చంద్రుడు!

oooooooo

''వారి వేపు, వీరివేపు, దీనంగా చూస్తున్నావ్. వారినీ, వీరినీ దీనాతిదీనంగా యాచిస్తున్నావ్. ఇప్పటికే చాలాకాలం జీవించావు. అయినా నీకు తృప్తి లేదు. నీవడిగిన వారందరూ నీకు సాయపడినా నీ వెక్కువ కాలం బతకవు. ఈ ముసలితనంలో కూడా ఇంకా బతకాలని తపన పడుతున్నావెందుకు? ఏం సాధించాలని?''అన్నాడతను వొడిలిపోయిన ఆ పూలచెట్టువేపు చూస్తూ.

''నా చిటారు కొమ్మకున్న ఓ చిన్నారి మొగ్గ, తిండిలేక నీరసించి పోతున్నది. దాని ఆకలి కేకలు వినలేకపోతున్నాను. అది పూవుగా ఎదిగి, పరమేశ్వరుని పాదసన్నిధి చేరుకోవాలని కోరుకుంటున్నాను. అందుకే, వారినీ వీరినీ ఓ దోసెడు నీళ్ళను యాచిస్తున్నాను''అన్నదా ముసలి

పూల చెట్టు.

oooooooo

"మీకు నమస్కారాలు, ధన్యవాదాలు, కృతజ్ఞతాభివందనాలు. ఇలా-ఎన్ని చెప్పినా, మీకింకా రుణపడే ఉంటాను"అన్నదా మొక్క వినయంగా.

"నేను మీకు చేసిందేమీ లేదే!"అన్నాడతను.

"అలా అనకండి. చావుకు సిద్ధంగా ఉన్న నన్ను తెచ్చి, ఊపిరి పోశారు. గుప్పెడు తిండికోసం చారెడు నీటికోసం అల్లాడిపోకుండా, వాటినీ మీరే సమకూర్చారు. వారివల్లా, వీరివల్లా అపాయం లేకుండా, రక్షణ కల్పించారు. ఇంతకన్నా ఎవరు కోరుకోవలసింది మాత్రం ఏముంది? ఇవన్నీ దయా హృదయానికి చిహ్నాలు కావా?"అన్నదా మొక్క.

"అవునో, కాదో నాకు తెలీదు గానీ- ఈ కాసిని పనులూ నేను నా సంతృప్తికోసమే చేశాను. ఓ  మంచి పని చేశానన్న ఆనందం అనుభవించండం కోసం చేశాను. అదీగాక, నాకు పచ్చని రంగులన్నా, రంగు రంగుల పూవులన్నా చాలా యిష్టం. బోలెడన్ని డబ్బులుపోసి, ఎదిగిన పూలమొక్కలను కొనుక్కోవడం కన్నా, ఓ దిక్కుమొక్కులేని మొక్కను తెచ్చి సాకితే, మంచి పని చేశానన్న సంతృప్తి, ఉచితంగా హరితపత్రాలు, రంగు రంగులపూలు కూడా లభిస్తాయన్న ఉద్దేశంతోనే, నేనీ పనిచేశాను"అన్నాడతను.

"మీరే ఉద్దేశంతో చేసినా, మీరు చేసిన పని, నాకో కొత్త జీవితాన్ని ప్రసాదించింది. నా సర్వశక్తులను కూడదీసుకొని, మీకు పచ్చని ఆకులూ ఇస్తాను, రంగుల పూలూ ఇస్తాను"అన్నదా మొక్క, అతనికి నమస్కరిస్తూ.

oooooooo

కొన్నిటి నుండి, కొన్నింటిని వేరు చేయడం సాధ్యం కాదు.

దీపం నుండి వెలుతురును వేరు చేయడం సాధ్యమవుతుందా?

పూల నుండి రంగులను వేరు చేయడం సాధ్యమవుతుందా?

చందనం నుండి, సుగంధాన్ని వేరుచేయడం సాధ్యమవుతుందా?

వస్తువు నుండి ఆకారాన్ని వేరుచేయడం సాధ్యమవుతుందా?

లేదు గదూ?

అలాగే- నానించి కాంతమ్మగారిని వేరు చేయడం కూడా సాధ్యం కాదు.

oooooooo

"ఎండలేమో మండిపోతున్నాయి. ఆ మంటలకు తాళలేక. గాడ్పులు వెచ్చగా పరుగులు తీస్తున్నాయి. మీరేమో-ఆ ఎండల మంటలకూ, గాలుల ఉరుకులకూ, తాళలేక సోలి తూలిపోతున్నారు. కాస్సేపు నా దగ్గరకు రండి. విశ్రాంతి తీసుకోండి. చల్లబడిన తరువాత వెడుదురుగాని"అని సాదరంగా నన్నాహ్వానించిందా ఎండుపరక.

మనుషులు తరిమిన కారణంగానే నేనిలా ఎండలపాలయ్యానని, ఆ గడ్డిపరకకు చెప్పలేకపోయాను. నల్లని దారపు ముక్కలా నేలకంటుకుపోయిన దాని సన్నని నీడను

కళ్ళకద్దుకొన్నాను.

oooooooo

దొంగతనం చేయకూడదని, నాదికాని దాన్ని, నేననుభవించరాదని, నాకూ తెలుసు. కానీ-మూడేసి, నాలుగేసి రోజుల పాటు పిడికెడు అన్నంగానీ, గుక్కెడు గంజికానీ దొరక్క, నేను సోలిపోతున్నప్పుడూ, తూలిపోతున్నప్పుడూ నేనీ సూక్తిని నమ్ముకొని కూచ్చోలేదు. ఇరుగు పొలంలో ఉన్న వేరుశనక్కాయలనూ, పొరుగు పొలంలో ఉన్న దోసకాయలనూ, ఆ పక్కనే ఉన్న గణుసు గడ్డల్నీ, ఈ పక్కనే ఉన్న రాంములక్కాయల్నీ, దూరంగా ఉన్న జొన్న కంకుల్ని, మొక్కజొన్న కండెల్ని రహస్యంగా తుంపుకొని, నా ఆకలిని చల్లార్చుకొన్నాను.

నా ఆదర్శం అప్పుడేమయినట్టు?

oooooooo

"ఎందుకో తెలీదు. ఎంత ఆలోచించినా కారణం బోధపడదు. ఆమెగారి చెక్కిళ్ళు స్వర్ణకాంతులతో సొంపులు కురుస్తున్నాయి. ఈశ్వరుని సౌందర్య తృష్ణకు అంజలించుదామనుకొనేంతలో, ఆ చెంపలమీద నల్లని చారలు సన్నగా కనిపించి, మనస్సును వెనక్కి మళ్ళిస్తాయి. అవును గదూ?"అన్నాడతను.

"ఆమె గారి కాంచన వర్ణ కపోలాలను ఓసారి స్పర్శించాలని, తపించిపోతోన్న నీలిముంగురులను, చెక్కిళ్ల దాకా చేర్చినందుకు, నేనిప్పుడు నొచ్చుకుంటున్నాను"అన్నదా గాలి తురగ.

oooooooo

కొందరికి నేను దూరమయ్యాను. మరికొందరు నాకు దూరమయ్యారు.

అందరినీ, అన్నింటినీ వొదిలించుకొని, లోపల బరువుల్నీ, బయటి బరువుల్నీ దించుకొని; బయలుదేరాను.

ఎండ మిటమిటలాడుతున్నా, వడగాల్పులు పెటపెటలాడుతున్నా నా నీడ మాత్రం నన్నంటి పెట్టుకొనే ఉంది.

నాతోనే, నా వెంటనే ఉన్న ఆ పిచ్చి నీడను చూస్తుంటే నాకు జాలి వేసింది. దాన్నలా ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక, పక్కనే ఉన్న చెట్టు కిందికొచ్చాను. నానీడ కూడా చెట్టు నీడకు అతుక్కుపోయింది.

ప్రభువు దయామయుడు! నా కిప్పుడు, నీడ బరువు కూడా లేకుండా చేశాడు!!

oooooooo

"నేను తలచినవారూ, పిలిచిన వారూ రాలేదు. అయినవారనుకొన్నవారూ రాలేదు. ఆత్మీయులనుకొన్నవారు కూడా రాలేదు. నేను, మిమ్మల్ని పిలవలేదు. సరిగదా, మరొకరితో కబురాన్న పంపలేదు. కనీసం మనసులోనయినా అనుకోలేదు. అయినా-మీరొచ్చారు. కృతజ్ఞుడ్ని. చెప్పండి. మీకేం కావాలి? నన్నేం చేయమంటారు?"అన్నాడతను.

"మీ నించి లబ్దిపొందిన వారంతా, మీ కవసరమయినప్పుడు, తెలివిగా తప్పుకున్నారు.

మీరు-ఇప్పుడు వొంటరి వారయిపోయారు గనుక; తోడుగా ఉందామని వొచ్చాను!''అన్నదా తూనీగ, అతని ముంజేతి మీద వాలుతూ.

oooooooo

''ఇంతకు ముందు, ఎవరో వచ్చారు. అప్పుడు- నీదగ్గర వొక్క పూవూ లేదు. వారలా, కంచెదాటి వెళ్ళారు. నువ్వేమో సన్నగా నిట్టూర్చావు. ఈలోగా, ఈవేపు నించి ఆమెగారొచ్చారు. ఇప్పుడు-నీనిండా పూలు పిక్కటిల్లిపోతున్నాయి''అని మధ్యలోనే ఆగిపోయిందా ఉడత.

ముందుగా వొచ్చినతను వ్యాపారి. తుంపుకెళ్లి, అరకాసుకో, కాసుకో, నా బిడ్డలను అమ్ముకుంటాడు. ఈ అమ్మగారు కూడా, నా బిడ్డలను తుంపుకెడతారు; ప్రభువు పాదాల ముందుంచడానికి''అన్నదా పూలచెట్టు.

oooooooo

''పిడికెడు గాలీ లేదు. జానెడు తోకా లేదు. బారెడు దారమూ లేదు. ఆడించేవారు అసలే లేరు. అయినా- ఆ గాలిపటం రివ్వున ఎగురుతున్నది. ఝుమ్మని గిరికీలు కొడుతున్నది. చివ్వు చివ్వున గెంతుతున్నది. చిత్రమనిపించి చూస్తున్నాను''అన్నదో గులకరాయి.

''కన్నబిడ్డకు, తినిపించడానికి, ఓ ముద్ద అన్నం కూడా లేదా తల్లికి. బిడ్డ ఏడుపును చూడలేక, ఓ సంపన్నుని 'అవసరం' తీర్చడం కోసం, చాటుకు వెళ్లిందా దురదృష్టవంతురాలు. ఆమెగారు తిరిగొచ్చిందాకా, ఆ బిడ్డను ఊరుకోబెట్టడం కోసం, ఆ ముసలి గాలిపటం. తనకు చేతనయిన పాట్లన్నీ పడుతూనే ఉంది''అన్నదా రావిచెట్టు. నీరు నిండిన నేత్రాలను తుడుచుకుంటూ.

oooooooo

''ఆగిపోయావెందుకు? అలసిపోయావా? విసిగిపోయావా?''అన్నదా చెట్టు ప్రశ్నార్థకంగా చూస్తూ.

''రెండూ కాదు. నిన్నానుకొని కూచున్న చిలకమ్మ. చిలకయ్యల తీపి కబుర్లు విందామని ఆగాను''అన్నదా పంటకాలువ మెల్లగా.

oooooooo

''అందరూ మెలకువను కోరుకుంటారు. వారు మాత్రం నిదురకావాలంటున్నారు. ఈధోరణి, కొంచెం చిత్రంగా ఉంది గదూ?''అన్నదో చిరుకప్ప.

''తాము-ఇష్టపడుతున్నవారినీ; తమను-ఇష్టపడుతున్నవారినీ; కలలోనయినా కలుసుకొందామనుకోవడంలో, తప్పేముంది?''అన్నదో వయసొచ్చిన పూవు!

oooooooo

అతనికి ఆర్థికసంపద, పదవీ సంపద, అధికార సంపద, కీర్తి సంపదల వంటివి చాలా ఉన్నాయి. అయినా, ఎప్పుడూ, అసంతృప్తితో విలవిల్లాడిపోతూ ఉంటాడు.

ఆ ముసలి బిచ్చగానికి, వీటిల్లో ఏ వొక్క సంపదా లేదు. చెంగు పరచుకొని, వొడ్డునే కూచుంటాడు. చెరువు నిండా కురిసే ఉభయ సంధ్యల కాంతుల్ని, మెరిసే మబ్బుల నీడల్ని

చూస్తూ; పిట్టల పాటల్ని వింటూ; దిశాంతాలా దాకా విస్తరించిన నీలాంబరాన్ని చూస్తూ; చుక్కల గుసగుసల్ని వింటూ; దయామయులయిన వారు ప్రసాదించిన కాయోగసరో తింటూ ఉంటాడు.

నా దృష్టిలో, ఆమొదటివారు-అన్నీ ఉన్న దరిద్రులు. ఈ రెండవ వారు ఏమీలేని సంపన్నులు.

ooooooooo

“చాలా అందంగా వున్నావు!”అన్నాడతను.

“నేనా?”అన్నదా అంబరం.

“అవును. నీవే! నా మాట మీద నమ్మకం లేకపోతే, నువ్వే చూసుకో!”అంటూ, తన దగ్గరున్న అద్దాన్ని అందించబోయాడు.

ఆ అద్దంవేపు చూసి, అయిష్టంగా ముఖం చిట్లించింది ఆకాశం.

“నా పట్ల మీకున్న అభిమానానికి, హృదయపూర్వకంగా నమస్కరిస్తున్నాను. నన్ను మన్నించండి. ఎంత ప్రయత్నించినా, ఇంత చిన్న ముకురంలోనికి నన్ను నేను కుదించుకోలేను. ప్రస్తుతానికి ఈ జలదర్పణంలో, నన్ను నేను చూసుకుంటాను”అన్నదా ఆకాశం. విశాలమయిన ఆ చెరువులో, తనను తాను చూసుకుంటూ.

ooooooooo

అటు మొలక ప్రాయంలోనయినా, ఇటు ముది వయసులోనయినా, ఇంకొకరి సాయం కావలసిందే! ఇది-మనుషులకే కాదు; సూరీడుకూ వర్తిస్తుంది.

బాలుడుగా ఉన్నప్పుడు, మబ్బుల అంచులను, పచ్చిక మైదానాలను, మొక్కలను, మహావృక్షాలను ఆధారం చేసుకొని పయికొస్తాడు సూర్యుడు.

కొన్ని గంటల పాటు అట్టహాసంగా వెలుగుతాడు.

సాయంవేళకు వయసుడిగిపోతుంది. మళ్ళీ మబ్బుల్ని పట్టుకొని కొండలమీదికి; అక్కడి నుండి చెట్లమీదికి; అక్కడ నుండి పొలాల మీదికి; ఆ తరువాత, పొలాల అవతలి వేపుకు జారిపోతాడు.

లేత ముసలితనంలోనయినా, ముదురు పసితనంలోనయినా, ఎవరికయినా ఆధారాలు కావలసిందే!

ooooooooo

“అద్దం కావాలా?”అన్నదా చెరువు. తన గట్టుమీద కూర్చున్న అమ్మాయిగారి వేపు చూస్తూ.

“అవసరం లేదు. తమరు కదలకుండా ఉంటే అంతే చాలు”అన్నాడు చందమామ, చెరువులో ప్రతిఫలిస్తున్న అమ్మాయిగారి ప్రతిబింబం వేపు చూస్తూ.

ooooooooo

గుక్కపట్టి ఏడుస్తోన్న పసిబిడ్డను, జోలపాడి, నిద్రపుచ్చడం ఆ మూగతల్లికి చేతకావడం లేదు. అందుకని, నేనా బుజ్జమ్మను భుజానికెత్తుకొన్నాను, జోలపాడాను, నిద్రపుచ్చాను.

ఈశ్వరుడు దయామయుడు!

ఇంత కాలానికి, నన్నో తల్లిని చేశాడు!

00000000

"ఈకట్ట మీంచి పోతున్నప్పుడూ, వొస్తున్నప్పుడూ; అల్లంత దూరంలో, మెరిసిపోతూ ఉండే నిన్ను చూశాను, ఇవ్వాళ-ఆ దూరం నించి ఈ తీరం దాకా వచ్చావెందుకు?"అన్నదామె.

"నీవలాపోతున్నప్పుడూ, వస్తున్నప్పుడూ, నేనూ నిన్ను చూశాను. అలా-వొకరినొకరం చూసుకొంటున్నప్పుడు, నీకూ నాకూ దగ్గరి పోలికలున్నాయని, వారూ వీరూ అంటున్నారు. అదెంత వరకు నిజమో తెలుసుకుందామని, వొడ్డు దాకా వచ్చాను"అన్నదా పద్యం.

00000000

"అప్పుడెప్పుడో మీరిచ్చిన పూలమొక్కల్ని, చాలా జాగ్రత్తగా చూచుకొంటున్నాను. అవి కూడా ప్రతిరోజూ, కాసినో, కూసినో పూలను పూస్తూనే ఉన్నాయి. 'కొత్తరకం పూలమొక్కలు" అంటూ ఇంకెవరో కొన్ని మొక్కలిచ్చారు. గడచిన అయిదారు రోజులుగా అవి కూడా బాగానే పూశాయి. ఇవ్వాళేమో-పూలూ లేవు. మొగ్గలూ లేవు. కారణం తెలీదు"అన్నాడతను నావేపు చూస్తూ.

"మాకు మాత్రం, వారాంతపు సెలవులవసరం లేదా?"అన్నాయా కొత్త పూలమొక్కలు.

00000000

"సంగీత బిందువంత అందంగానూ, వర్ణచిత్ర శకలమంత శ్రావ్యంగానూ ఉన్నది గనుకనే, కనులతో వింటూ, చెవులతో, చూస్తున్నాను"అన్నది కొత్తగా ఆ గది గోడకు వేళ్ళాడుతోన్న అద్దం.

"నిర్మల హృదయుల నిదురలో నడయాడే సున్నితమయిన స్వప్నం, నిదుర వెలుపలికి తొంగి చూసినప్పుడల్లా, చిన్న శబ్దమయినా చిత్రవర్ణాలతో మెరుస్తూ కనబడుతుంది. చిన్న చిత్రమయినా రంగురంగుల రాగ శకలాలతో వినబడుతుంది!"అన్నది ఓ మూలగా, మెల్లగా వెలుగుతోన్న ఓ చిన్నారి దీపం!

00000000

"ఆ చందమామను చూడు, ఎంత శుచిగా, శుభ్రంగా నిర్మలంగా ఉన్నాడో!"అన్నదా మర్రిచెట్టు తన పక్కనే ఉన్న చెరువుతో.

"తెల్లవార్తూ, నాలో స్నానం చేస్తూనే ఉన్న చందమామ;శుచిగా, శుభ్రంగా, నిర్మలంగా ఉండడంలో ఆశ్చర్యమేముంది?"అన్నదా తటాకం!

00000000

"నా మాటున దాక్కున్నావెందుకు?"అన్నదా దీపం కళ్ళు చికిలించి చూస్తూ.

"తమరు కన్నుమూశాక, తమ నెత్తికెక్కి, తైతక్కలాడుదామని"అన్నదా చీకటి.

00000000

"మీరు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. నేను కాదనడం లేదు. అనూహ్యమయిన చోట్ల

అన్వేషిస్తున్నారు. దీనినీ నేను కాదనడం లేదు. కానీ-మీరు దేనికోసం అన్వేషిస్తున్నారో, ఎందుకోసం ఇంతలా పాటుపడుతున్నారో, మీకయినా స్పష్టంగా తెలియకపోతే, మీ అన్వేషణ, మీ కృషి వ్యర్థం కాదా?"అన్నారు నా మిత్రులొకరు.

నేను మౌనంగా ఉండిపోయాను.

"జవాబు చెప్పలేరా?"అన్నాడాయన మళ్ళీ.

"ఏది సార్థకమో, ఏది నిరర్థకమో-అనుభవపూర్వకంగా తెలుసుకొందామనుకొంటున్నాను"అన్నాను.

నా మిత్రులేమీ అనలేదు గానీ, స్వామి పరమానంద మాత్రం చిరుచిరుగా నవ్వారు.

oooooooo

"చాలామంది, చాలా రకాల కోరికలను వెలిబుచ్చారు. మీరు మాత్రం మౌనంగా ఉండిపోయారు. మీకే కోరికలూ లేవా?"అన్నాడా దేవదూత.

"ఉన్నా"యన్నట్టుగా, తలపంకించాడతను.

"మీ కోరికలేమిటి?"అన్నాడు దేవదూత.

"కోరికలు-అన్న బహువచనం కూడా అవసరం లేదు. 'ఇంకా తెలుసుకోవాలి' అన్న ఒకే ఒక కోరిక నాకింకా మిగిలి ఉన్నది!"అన్నాడతను.

"మరొకరికి తెలియచెప్పడం కోసమే, తెలుసుకుందామనుకొంటున్నారా?"అన్నాడా దూత.

"తెలుసుకోవడం వేరు. తెలియచెప్పడం వేరు. తెలుసుకోవడం అన్నది అచ్చంగా నాకు సంబంధించింది, నా అవసరం కొద్దీ, ఆసక్తి కొద్దీ, నేను తెలుసుకొంటూ ఉంటాను. 'తెలియచెప్పడం'అన్నది, వృత్తిలో భాగం కావచ్చు. ఎదటి వారి మీది ప్రేమాభిమానాలు కావచ్చు. 'తెలుసుకోవడం'అన్నది పెరిగిన కొద్దీ, ఎదిగిన కొద్దీ, విస్తరించిన కొద్దీ, 'తెలియ చెప్పడం'అన్నది కరిగిపోతూ, కరిగిపోతూ, కరిగిపోతూ; తరిగిపోతూ, తరిగిపోతూ, తరిగిపోతూనే ఉంటుంది"అన్నాడతను.

oooooooo

"ఎంత సేపటికీ, వారినడిగీ, వీరినడిగీ ఏదో వొకటి తీసుకోవడం తప్ప; ఎవరికీ, ఎప్పుడూ, ఏదీ ఇచ్చినట్టు నేను చూడలేదు. మరొకరు చెప్పుకోవడం కూడా నేను వినలేదు. ఎందుకిలా తయారయ్యావ్?"అన్నాను కాస్త కోపంగా.

"మరొకరికివ్వదగిన స్థాయిగలిగిన వేవీ నాకు లేవు. కాకపోతే వల్లమాలిన సొట్టలు, కొల్లమాలిన లొట్టలు, బుట్టలకొద్దీ అజ్ఞానం, తట్టలకొద్దీ అవివేకం లాంటివి చాలా చాలా నాకున్నాయి. వాటిని ఇతరులకు పంచి ఇవ్వడం భావ్యం కాదు గదా! అందుకని ఇతరులను కాస్త వివేకం, కూస్త జ్ఞానం, పిడికెడు మంచితనం, పుడిసెడు కారుణ్యం అర్థించుతున్నాను"అన్నరు వారు, చాలా ప్రశాంతంగా.

మెదడులో దీపం వెలిగించిన ఆ ధన్యజీవికి పాదాభివందనం చేశాను.

oooooooo

పదిమంది ముందు జరిగిన ఒక సంఘటన, ఆ పదిమందినీ, ఒకేరకంగా స్పందింప చేయకపోవడానికి కారణాలేమిటి? ఒకరు ఒక రకంగానూ, మరొకరు మరోరకంగానూ స్పందించడానిక్కారణమేమిటి?

మిమ్మల్ని చలింపచేసిన ఆ సంఘటన, నన్నెందుకు కదిలించలేకపోయింది?

ఒక కావ్యం చదివి, మీరు తన్మయత్వం చెందారు. అదే పుస్తకం, నాకో తుక్కుచెత్తగా ఎందుకు కనిపించింది?

ఒక వాక్యం-ఒకే వొక్క వాక్యం, మనకో తులసీదాసును ప్రసాదించింది. ఇన్ని చట్టాలు, న్యాయస్థానాలు, పోలీసుశాఖలు, కారాగారాలు, మఠాలు, ఆలయాలు, మతబోధకులు ఉండి కూడా, ఒక్క నేరస్థుణ్ణయినా, మంచి తోవలోకి ఎందుకు మలచలేకపోతున్నాయి?

జత పక్షి చనిపోయిన కారణంగా, విలవిల్లాడుతోన్న మరో పక్షిని చూసి, వాల్మీకి మహాకవి రామాయణం రాశాడు. ఓ మబ్బు తునకను చూసి కాళిదాసు మేఘసందేశ మహాకావ్యం రాశాడు. చనిపోయిన పక్షులనూ, కదులుతోన్న మబ్బులనూ చాలామంది చూశారు. ఎవరూ, ఏమీ ఎందుకని రాయలేకపోయారు?

oooooooo

మన శత్రువులు కల్పించే అవరోధాలు, అడ్డంకులు, మనల్ని చికాకు పరిచే మాట నిజమే గానీ; అవి మన బుర్రకు పదునుపెడతాయి. మన ఆలోచనలను కొత్తకొత్త తోవల్లోకి మళ్ళిస్తాయి.

oooooooo

మీరు -అదృష్టవంతులు.

‘‘ఎవరు మీ గురువు?’’అని అడిగితే అయిదారుగురి పేర్లు చెబుతారు. కాదూ కూడదనుకొంటే- ఓ పాతికమంది పేర్లు చెబుతారు.

ఇదే ప్రశ్న నన్నడిగితే మాత్రం, నేను చాలా ఇరుకునపడతాను.

‘‘చిన్న చీమ లగాయతు, చిరంతనానంద స్వామి దాకా అందరూ నాకు గురువులే!’’నని చెప్పవలసి వస్తుంది.

oooooooo

‘‘మిమ్మల్ని చాలాకాలంగా చూస్తున్నాను. ఎప్పుడూ ఏదో వొకటి చెబుతూనే ఉంటారు. మీ ఆశకు అంతులేదా? తృప్తిపడడం మీకు చేతకాదా?’’అని కొంచెం గట్టిగానే అడిగాను.

ఆయన విసుక్కుంటారనుకొన్నాను. కానీ, మెత్తగా నవ్వారు.

‘‘మొన్న మొన్నటిదాకా అదృష్టాన్ని వెదుక్కొన్నాను. ఇప్పుడేమో అవకాశాన్ని వెదుక్కుంటున్నాను. ‘తెలుసుకోవా’లన్న నా ఆశకు ‘తృప్తి’ పడడం ఇంకా తెలీదు’’అన్నారాయన!

oooooooo

‘‘ఆకుమీద వాలిని ఆ నీటిచుక్కను, మీరెందుకంత నిశితంగా చూస్తున్నారు? ఎందుకలా చెవులు రిక్కించి వింటున్నారు?’’అని ప్రశ్నించాను ఆ సీతాచిలకను.

‘‘అది విషాదాశ్రువో, ఆనందాశ్రువో తెలుసుకొందామని’’-అన్నాను.

“అలా తెలుసుకోవడం సాధ్యమని మొదటిసారిగా వింటున్నాను”అన్నాను.

“నీకూ, నీవంటి వారికీ, ఇది మొదటిసారి కావచ్చు. నాకూ, నావంటి వారికీ ఇది-సర్వసాధారణం. విషాదాశ్రువయితే వెచ్చగా వెక్కెక్కిపడుతూ ఉంటుంది. ఆనందాశ్రువయితే, చల్లగా పకపకలాడుతూ ఉంటుంది”అన్నది సీతాచిలక.

“తెలుసుకొని ఏం చేస్తావ్?”అన్నాను.

అదో మారు, నన్నెగాదిగా చూసింది.

“తెలుసుకొన్నానన్న తృప్తిని అనుభవిస్తాను. ఆనందాశ్రువయితే అందులో నేనూ భాగం పంచుకొంటాను. విషాదాశ్రువయితే, ఆ దుఃఖం నుండి బయటపడేందుకు, అవతలి వారికి చేయగలిగిన సాయమంతా చేస్తాను”అన్నదా సీతాచిలక!

oooooooo

“నిన్న రాత్రంతా, నీకోసం ఎదురుచూస్తే నేనా కలువకాడ పక్కనే ఉన్నాను. నీ అయిపూ, ఆనమాలూ లేదెందుకని?’అన్నాదా మీనమ్మ రుసరుసలాడుతూ.

“అలసి సొలసి, ఆదమరిచి నిదురపోతున్న చెరువమ్మకు, నిద్రాభంగం కలిగించడం ఇష్టం లేక, ఉన్నచోటనే ఉండిపోయాను”అన్నదా చేపబ్బాయి.

ఓ మారు ఆపక్కకూ, మరో మారు ఈ పక్కకూ చూసి, చూపు కందినంత వరకూ, ఎవ్వరూ లేరని తేలిపోయాక, చేపబ్బాయిని గట్టిగా కౌగలించుకొని, “నువ్వు నా బంగారు కొండవు కన్నా!”అన్నదా చేపమ్మాయి, తన ప్రియుని చెంపను పదే పదే ముద్దాడుతూ.

oooooooo

“చాలా సేపట్నుంచీ చూస్తున్నాను. అతను -ఆ పక్కకూ, ఈ పక్కకూ తిరుగుతున్నాడు. పైకీ కిందికీ గెంతుతున్నాడు. ఎవరన్నా తరుముతున్నారేమో, ప్రాణభయంతో అలా చేస్తున్నాడనుకోడానికయినా, ఇక్కడెవ్వరూ లేరు. పోనీ-పిచ్చివాడనుకొందామన్నా, అలా కనిపించడం లేదు. అవును గదూ?”అన్నదో పూవు అతని వేపే చూస్తూ.

“అతన్నెవరూ తరమడం లేదు. అతను ఉన్మత్తుడూ కాదు. అల్లంత దూరంలో, ఎవరికోసమో ఎదురుచూస్తోన్న, ఆ సుందరమ్మగారి దృష్టిలో పడాలని అతని తాపత్రయం!”అన్నదో తూనీగ.

“అని-మీకెలా తెలుసు?”అన్నదా పూవు.

“స్వానుభవం. ఇందాకణ్నించీ నేనూ అల్లాగే చేశాను; నీ దృష్టిలో పడాలని!”అన్నదా తూనీగ. ఆ పూవమ్మకు దగ్గరగా జరుగుతూ.

oooooooo

మొగ్గ తుప్పర బాగా ముదిరినట్టుంది. చెట్టు చుట్టూ చినుకుపూలు రాలుతున్నాయి. చెట్టుకింద పూల చినుకులు రాలుతున్నాయి!

oooooooo

ఆ చిత్రకారుడు, వర్షమేఘాలను అద్భుతంగా చిత్రించాడు. రంగులు అద్దడం కోసం, ఆ

చిత్రపటాన్ని, ఓ గది మూలగా ఉంచాడు. తెల్లవార్లూ, ఆ గదిలోంచి మెరుపులు కనబడుతూనే ఉన్నాయి. ఉరుములు వినబడుతూనే ఉన్నాయి.

oooooooo

"వాన లేదు, తుప్పర లేదు, కనీసం మంచు కూడా పడడం లేదు. అయినా, ఈ గన్నేరు పూవు తడితడిగా ఉన్నదెందుకుని?"అన్నదా తూనీగ.

"దాని ప్రతిబింబం చెరువులో తడుస్తుంటే, ఆ గన్నేరు పూవుగారికి ఆ పాటి తడి కూడా అంటదా?"అన్నదో మీనమ్మ.

oooooooo

పుట్టుకతోనే నీవు పుట్టెడంత అందాన్ని తెచ్చుకొన్నావు. అది చాలదేమోననుకొని, ఆత్మీయమయిన నవ్వును కూడా ప్రభువు నీకు ప్రసాదించాడు.

ఆ నవ్వు-నీ పెదవుల మీదుగా, చెక్కిళ్ళమీదుగా, కళ్ళమీదుగా, ముఖమంతా అల్లుకుపోయింది. మెత్తగా వెలుగుతోన్న ఆ నవ్వును, ఓ మారు స్పర్శించుదామని, నిదురపోతున్న నిన్ను సమీపించాను. నాకన్నా ముందుగా, నా నీడ నిన్ను తాకింది. ఆ పిచ్చి నీడ తొందరపాటు వల్ల, నీవు మేలుకొన్నావు.

నిదురపోతున్న నీ ముఖాన్ని, నిండుగా వెలిగించే అందమయిన ఆ నవ్వును స్పర్శించడం కోసం, ఎన్ని జన్మలెత్తడానికయినా, నేను సిద్ధంగా ఉన్నాను!

oooooooo

ఏవి శాశ్వతమో, ఏవి అశాశ్వతమో నాకు తెలీదు. నేను మాత్రం శాశ్వతం కాదని నాకు తెలుసు.

నేనేమయినా, నీవు మాత్రం, కలకాలం, కళకళ్లాడుతూ ఉండాలని నా ఆకాంక్ష.

అందుకేం చేయాలో తోచక, నేను గిజగిజలాడిపోతున్నప్పుడే, ఓ దయామయుడు, నాకు నక్షత్రాలను చూపించాడు. వాటి శాశ్వతత్వాన్ని గురించీ బోధించాడు. కొత్త కాంతులేవో నాలో విరిసినట్లనిపించింది.

నీ గురించిన నా జ్ఞాపకాలన్నింటినీ, నక్షత్ర మండలాల ఆవలి తీరాన భద్రపరిచాను. శాశ్వతంగా మిగిలిపోవాలని!

oooooooo

నన్ను నేనెక్కడో దాచుకోవాలనీ, ఎక్కడ దాచుకొన్నదీ నాకే తెలీక, ఇక్కడా, అక్కడా నన్ను నేనే వెదుక్కోవాలనీ, ఎంత వెదికినా, నాకు నేను కనిపించని కారణంగా, నామీద నాకే కోపం రావాలనీ, నాకో సరదా!

చాలా విషయాలు నాకు చేతకానట్లే; నన్ను నేను దాచుకోవడమూ, నన్ను నేను పారేసుకోవడమూ కూడా, నాకు చేతకావడం లేదు.

oooooooo

ఒకప్పుడు మాట సాయంతో, ఎంత క్లిష్టమయిన భావాన్నయినా చెప్పవచ్చు

నసుకొనేవాణ్ని. ఇప్పుడేమో మౌనం చెప్పినంత స్పష్టంగా, సమగ్రంగా, మాటలు చెప్పలేవన్న పరమసత్యాన్ని తెలుసుకొంటున్నాను.

00000000

కావాలని, నేను కోరుకొన్న స్థాయి వేరు, అదేమిటో నాకు స్పష్టంగా తెలుసు. ఇప్పుడే నేనుంటున్న స్థాయిని గురించీ, ఉన్నానని నేనుకొంటున్న స్థాయిని గురించీ, మీరు చెప్పిందాకా నాకు తెలీదు. నన్ను కమ్మిన మాయతెరను తొలగించి సత్యాన్ని దర్శనీయం చేసినందుగ్గాను మీకు నేనివ్వగలిగిందల్లా, ఓ చిన్న నమస్కారం మాత్రమే!

00000000

మన సంతృప్తి కోసమే మనమేదో అనుకొంటూ ఉంటాం గానీ- అటు అజ్ఞానానిగ్గానీ, ఇటు జ్ఞానానిగ్గానీ, సంపూర్ణత్వమంటూ లేదు. ఇవి రెండూ, అనంతాలే!

00000000

అప్పుడెప్పుడో రెండు మూడు జలపాతాలు చూశాన్నేను; ఇవ్వాళ ఆకాశం మీంచి, అవని మీదికి జారుతోన్న ఓ మేఘపాతాన్నీ చూశాను.

00000000

''ఇంత జలభారాన్ని మోసుకొంటూ, ఇంత వేగంగా ఎక్కడికి పరుగుతీస్తున్నారు?''అన్నాను వారి వేపు జాలిగా చూస్తూ.

''అవసరమున్న వారికి అందించడం కోసం!''అన్నదా కరిమబ్బు, నావేపు ఓరగా చూస్తూ.

00000000

''గాలి పిలిచినా పలుకుతారు గదా! మునివేళ్ళతో స్పర్శించినా, స్పందిస్తారు గదా! అల్లాంటి మీరు-గీటినా, మీటినా, ముట్టినా, తట్టినా, పలకరెందుకని?''అన్నాడతను.

''ఈ ముదురు చీకట్లలో అటు మొదలవడానికి, ఇటు కదలడానికి భయమేస్తుంటే ఇంకేం పలకను, ఇంకెలా పలకను బాబుగారూ?''అన్నదా వీణాతంత్రి అతనికే వినిపించేంత మెల్లగా.

00000000

ఈ ఊరి చెరువు చాలా చిత్రమయిందీ ఎంతో అందమయిందీ కూడా. దీన్నిండా పుండరీకాలు, చంద్రకాంతాలు ఒంటికాడల మీద నిలబడి ఉంటాయి. చిన్న చప్పుడయితే చాలు, రెక్కలు విప్పుకొని, కొంగల్లా ఎగిరిపోతాయి.

00000000

మీ డబ్బు మీకు సమకూర్చలేని చాలా వాటిని; మీ సౌజన్యం, మీ సచ్ఛీలం, మీ దయాగుణం, మీ నిర్మలత్వం, మీ వ్యక్తిత్వం, మీ ముందు సంతృప్తి బిందువులను చిలకరిస్తాయి!

00000000

''తేడా!''అన్నది ఎక్కడో లేదు; నాలోనే ఉన్నది. నాకు తెలిసిన దానికీ; ''తెలుసు''నని

నేనుకొన్నదానికీ మధ్య ఎంతో తేడా ఉన్నదని, ఇప్పుడిప్పుడే తెలుసుకొంటున్నాను!

oooooooo

''ముందుగా నిన్ను చూశాను. తరువాత ఆకాశాన్ని చూశాను. నాకు బాగా తెలిసిన, నా ఆకాశం నేనెన్నడూ చూడనంత అందంగానూ, కొత్తగానూ కనిపించింది. ఎందుకనో తెలీదు''అన్నాడతను.

ఆ మాట వింటూనే ఆమెగారు చిరునవ్వులా మొలిచి, పులకరింతలను పుష్పించింది.

oooooooo

నేనంటే మా వాళ్ళకు చాలా ప్రేమ, నేను ఏరకంగానూ కష్టపడకూడదనీ, ఇబ్బంది పడకూడదనీ వారనుకొన్నారు. అనుకొన్నాక ఈ కష్టాలకూ, ఇబ్బందులకూ కారణమేమిటని ఆలోచించారు. ఆలోచించగా, ఆలోచించగా, ఆలోచించగా, ''దాచుకోవడం''అన్నది కష్టమనీ, ఆ దాచుకొన్నది పరుల పాలుకాకుండా కాపాడుకోవడం మరీ కష్టమనీ వారికి తోచి ఉండాలి. అందుకేనేమో-దాచుకొనవలసినవీ, జాగ్రత్తగా కాపాడుకోవలసినవీ నాకేమీ లేకుండా చేశారు. ఎవరికయినా నా నించి కావలసిందేమీ లేదు గనుక, ఎవ్వరూ నా జోలికి రారు. ఇతరులు తస్కరించదగిన అమూల్యాంశాలు నా దగ్గరమేమీ లేవు గనుక, నేను నిర్భయంగానే ఉంటాను.

oooooooo

ఎండలు మండిపోతున్నాయి. పయినున్న తెల్ల మబ్బులు కరిగిపోతుంటే, కింద ఉన్న గడ్డిదుబ్బులు కాలిపోతున్నాయి.

కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా, తూలి, సోలిపోతున్న అతన్ని చూసి, జాలిపడ్డాడు ప్రభువు. అల్లంత దూరంలో ఓ పెద్ద చెట్టును సృష్టించాడు.

ఆ ప్రయాణీకుడు చెట్టుకిందికొచ్చాడు. రాలిన ఆకులన్నీ పేర్చి నడుం వాల్చాడు. సేదతీరాక, ఆ చెట్టుకున్న కాయలతో ఆకలి తీర్చుకొన్నాడు. మోయగలిగినన్ని కాయలను మూట గట్టుకొని, ఎండ వేడి తగ్గాక మళ్ళీ ప్రయాణమయ్యాడు.

ఒక సదవకాశాన్ని ప్రభువు ప్రసాదించింది; దాన్ని ఆధారం చేసుకొని మరికొన్ని అవకాశాలను మనం సంతరించుకోవాలనే!

oooooooo

''ఉదయపు నడకలో నిన్ను చూశాను. నీ నిండా రంగుల పూలున్నాయి. ఆ పూలరెమ్మల నిండా చిత్తవత్తుగా ముళ్ళూ ఉన్నాయి. ఈ సాయం నడకలో నిన్ను చూసినప్పుడు, నీ రంగు రంగుల పూలన్నీ తెల్లగా మారిపోయాయి. రెమ్మలకున్న ముళ్ళన్నీ రాలిపోయాయి. వింతగా ఉంటేనూ చూస్తున్నాను''అన్నాడతను, ఆ పూల చెట్టు గారడిగిన ప్రశ్నకు జవాబు చెబుతూ.

''మరికొంచెం సేపట్లో వో బంగారుతల్లి ఇక్కడకు రాబోతున్నది. ఆమెగారికి తెల్లరంగంటే ఇష్టం. అందుకని పూవులన్నింటిని తెల్లగా మార్చేసుకొన్నాను. ఈ పూలను తుంపుకొనేటప్పుడు గుచ్చుకోవచ్చునన్న అనుమానంతో, నాకున్న కంటకాలనన్నింటినీ, నేనే తుంపుకొన్నాను!''అన్నాదా పూలచెట్టు.

oooooooo

వందల వేల సంవత్సరాల చరిత్రను పరిశీలించి చూస్తే, ఒక మనిషి, తోటి మనిషిని హతమార్చడానికి చేసిన యత్నాలే ఎక్కువగా కనబడతాయి.

ఇన్ని శతాబ్దాల పాలకులు చేసిన చట్టాలను, శాసనాలను, సూత్రాలను పరిశీలించి చూస్తే, ఒక మనిషి-తోటి మనిషిని అదుపు చేయడానికి చేసిన యత్నాలే కనబడతాయి.

ఇన్ని సహస్రాబ్దాలు గడిచినా-ఒక మనిషి తనలాంటి మరో మనిషినింకా మోసం చేస్తూనే ఉన్నాడు, హతమారుస్తూనే ఉన్నాడు; అతని క్రూర చర్యలను అదుపు చేయలేకపోతున్నాడు; అతన్ని సన్మార్గానికి మళ్ళించలేకపోతున్నాడు.

కానీ-మంచును మండిస్తున్నాడు, మంటను శీతలీకరిస్తున్నాడు, మనిషిని మాత్రం-మనిషే-మార్చలేకపోతున్నాడు.

oooooooo

''అది నాది ఇది నాది''అనుకొన్నంత కాలం; దానిని గురించీ, దీనిని గురించీ, అభిమానం పెరుగుతూ ఉంటుంది. పెరిగి పెరిగి పెరిగి, అన్నింటినీ నా సొంతం చేసుకుందామనిపిస్తుంది. అలా చేసుకోవడం కోసం రకరకాల ప్రయత్నాలూ ప్రారంభిస్తాను. కొన్నిసార్లు విజయం నాదవుతుంది. ఎక్కువసార్లు అపజయం పాలవుతాను.

నాకన్నా బలసంపన్నులు, మేధా సంపన్నులు, ఆయుధ సంపన్నులు కలిసి, ''నాది''అనుకొన్నవాటన్నింటినీ, నా నించి తీసుకొంటారు. మరొకరి నుండి, నేను స్వాధీనం చేసుకొన్న వాటినన్నింటినీ, నా నుండి వేరొకరు స్వాధీనం చేసుకొన్నప్పుడు; నేను బాధతో గిలగిలాడిపోతాను. రోదనతో విలవిల్లాడిపోతాను. అప్పుడెప్పుడో నేను స్వాధీనం చేసుకొన్నప్పుడు; అవతలి వారు కూడా ఇలానే క్షోభించి ఉంటారన్న సత్యం ఇప్పుడు గానీ నా అనుభవంలోకి రాదు.

నా కన్నా ముందుగా లోకంలోకి వచ్చిన వారు, తమ వెంట ఏమేమి తెచ్చుకున్నారో, నాకు తెలియదు-తెలియచెప్పినవారూ లేరు. నేనేమీ తెచ్చుకోలేకపోయాను గనుక, వారూ ఏమీ తెచ్చుకొని ఉండరనుకొంటున్నాను.

నా కన్నా ముందుగా ఈలోకం నుండి నిర్గమించినవారు, తమ వెంట ఏమి తీసుకుపోయారో నాకు తెలియదు-తెలియచెప్పినవారూ లేరు.

అంగబలంతో, ఆయుధబలంతో, శాస్త్రబలంతో, మోసాలతో, ద్రోహాలతో, కుట్రలతో, మారణహోమాలను మేల్కొలిపి, రక్తప్రవాహాలతో వసుంధరను అభిషేకించిన వారందరూ; తాము సాధించినవన్నీ ఇక్కడే వొదిలి, ఎలా వచ్చారో అలానే వెళ్లిపోయారు!

అందుకే, కొంత కాలంగా, ''అది నాది ఇది నాది''అనుకోవడం మనేశాను. మానేశాక, మసక దిగులు నన్ను కమ్మివేసింది.

''అది నాది, ఇది నాది కానప్పుడు; వాటి స్థానంలో వచ్చిన ఈ దిగులు మాత్రం నాదెలా అవుతుంది?''అని నన్ను నేనే ప్రశ్నించుకొన్నాను.

ఆ దిగులుగారూ,నన్ను తప్పుకున్నారు.

ఇప్పుడు-

"ఏదీ నాది కాదు"అనుకొంటున్నాను.

ఫలితంగా-

"అన్నీ నావే! అన్నీ నేనే!"అనిపిస్తున్నది.

**- ప్రస్తుతానికి సెలవు**